



బంతి బంతికీ.. బెట్టింగ్

రేటింగ్ ప్రకారం పందేలు..

మ్యాచ్ ప్రారంభం కాకముందే బాగా ఆడే టీమ్‌లను బట్టి బెట్టింగ్ యాప్‌ల్లో రేటింగ్ పెడతారు. యాప్‌లో చూపించే రేటింగ్ ప్రకారం పందేలు కాస్తారు. ఒక ఓవర్‌లో ఇన్ని పరు గులు తీయలేరు.. తీస్తారు, ఫలానా బ్యాట్స్‌మన్ ఎన్ని పరుగులు తీస్తాడు. ఎన్ని ఓవర్లలో ఎంత స్కోర్ చేస్తాడు.. ఇలా ఫ్యాన్సీలు ఆడుకునే అవకాశం ఇస్తారు. దీంతో మ్యాచ్ ఆరంభం నుంచి ముగిసే వరకు ప్రతి దానిపై పందేలకు జూదరులు సిద్ధమవుతున్నారు.

- యువతే లక్ష్యంగా మాఫియా సిద్ధం
- నేటి నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు
- ఆన్‌లైన్‌లో బహిరంగంగానే.. ప్రత్యేక యాప్‌లు
- జీవితాలను నాశనం చేస్తోన్న బెట్టింగ్‌లు
- గతంలో నరసరావుపేటలో ముగ్గురు బలవన్మరణం
- మే 25 వరకు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచనలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐపీఎల్‌కు క్రికెట్ క్రీడాకారులు సన్నద్ధమవుతుండగా.. పోటీలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తుండగా.. తమ అభిమాన క్రీడాకారుడి మెరుపులను చూసి మైమరిచేందుకు అభిమానులు ఎదురు చూస్తుండగా.. బెట్టింగ్‌లకు బుకీలు, పంటర్లు సిద్ధమవుతున్నారు. శనివారం నుంచి ఐపీఎల్ పోటీలు ప్రారంభం కానున్నాయి. దీంతో యువతే లక్ష్యంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో బెట్టింగ్‌ల మాఫియా ఏర్పాట్లు చేసుకుంటోంది. ప్రతీ బాల్‌కు బెట్టింగ్ నిర్వహించేందుకు ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లను సిద్ధం చేసుకుంటున్నది. ఈ సారైనా డబ్బు సంపాదించాలని అత్యాసతో జూదరులు సమాయత్తమవుతున్నారు. సాంకేతికతను మాఫియా అందిపుచ్చుకుని బెట్టింగ్‌లను నిర్వహించేందుకు సిద్ధమైంది. బెట్టింగ్ విధానంలోనూ మార్పులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా క్రికెట్ కోసం యాప్‌లు వచ్చాయి. దీంతో ఫోన్ ద్వారా నేరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. బెట్టింగ్ నిర్వహించేవారు సదరు యాప్స్ వివరాలు ముందుగా తెలియజేస్తారు. పందేలు కాసేవారి నుంచి ముందుగా కొంత నగదును యూపీఐ విధానంలో అడ్వాన్స్‌గా వసూలు చేస్తారు. నగదు ఎవరికి పంపుతున్నారో తెలియకుండా మాఫియా జాగ్రత్తలు తీసుకుంటోంది. యాప్‌లు నిర్వహించేది ఎవరు.. వారు ఎక్కడ ఉంటారన్న సమాచారం కూడా బయటకు రానివ్వరు. నగదు జమయ్యాక మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి వరకు బెట్టింగ్‌కు అవకాశం కల్పిస్తారు.

పిల్లల్ని కాపాడండని తల్లిదండ్రుల వినతి

ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రారంభమవుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌ల నుంచి తమ పిల్లలను కాపాడాలని కోరుతూ పలువురు తల్లిదండ్రులు ఎస్పీ కంచి శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు. గతంలో లేఖలు రాసినా పోలీసు అధికారులు చర్యలు తీసుకోలేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బెట్టింగ్‌లు నిర్వహించే వ్యక్తులకు కొందరు పోలీసు అధికారులు సహకరించారని కూడా తెలిపారు. రొంపిచర్ల మండలానికి చెందిన ఇద్దరు బుకీల నుంచి తమ పిల్లలను రక్షించాలని వేడుకున్నారు. పోలీసు శాఖ బెట్టింగ్‌ల విషయంలో ఏవిధంగా స్పందిస్తుందో చూడాలి. గత సీజన్‌లో రొంపిచర్ల మండలం అలవాలకు చెందిన ఓ యువకుడు బెట్టింగ్‌లతో నష్టపోయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే మండలానికి చెందిన మరో యువకుడు, నరసరావుపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన మరో యువకుడు కూడా ఆత్మహత్య చేసుకున్నారు. బెట్టింగ్‌లతో యువకులు బలవన్మరణం చెందుతున్నా వీటిని అరికట్టడంలో పోలీసు శాఖ స్పందించడంలేదన్న విమర్శలున్నాయి.

ఆసక్తితో.. అప్పుల ఊబిలో యువత

క్రికెట్ పందేల వైపు యువతే ఎక్కువగా ఆసక్తి చూపుతోంది. కళాశాల విద్యార్థులు మొబైల్ యాప్ ద్వారా అత్యధికంగా పందేలు కాస్తున్నారు. మొబైల్‌లు, ల్యాప్‌టాప్‌లు, బంగారు చైన్లు, బైకులు, కార్లు కుదవ పెట్టి అప్పులు తీసుకుని పందేలు కాస్తున్నారు. చివరకు జీవితాలనే నాశనం చేసుకుంటున్నారు. పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షిస్తూ బెట్టింగ్ మాయలో చిక్కుకోకుండా చూడాలని పలువురు సూచిస్తున్నారు. మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు ఫోన్లతో పిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలని, విలువైన వస్తువులు కనిపించకపోయినా, ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నా పెద్దలు అప్రమత్తమవ్వాలని హెచ్చరిస్తున్నారు. ఏదిఏమైనా మే 25 వరకు తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు.

కొత్త పుంతలు..

బెట్టింగ్‌లు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గతంలో ఓ ప్రాంతంలో ఉండి నగదును తీసుకుని నేరుగా ఒకరితో ఒకరు పందేలు కట్టేవారు. ఆ పరిస్థితులు ఇప్పుడు లేవు. పంటర్లు, బుకీలు హోటళ్ల, లాడ్జీల్లో గదులను అద్దెకు తీసుకుని మ్యాచ్‌ల గెలుపు ఓటములపై పందేలు కాసేవారు. ఈ ఓవర్‌లో ఇన్ని పరుగులు వస్తాయి.. ఏ బ్యాట్స్‌మన్ ఎంత స్కోరు చేస్తాడు.. ఈ బాల్‌కు ఎన్ని పరుగులు వస్తాయి.. తదితరాలపై నగదు కలుపుకుని పందేలు కాసేవారు. అయితే సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇలాంటి పందేలు తగ్గిపోయాయి. సెల్‌ఫోన్‌లోనే బెట్టింగ్‌లు కాయడం.. నగదు మార్పిడి జరిగిపోతోంది. ఎవరు ఎవరికి నగదు పంపిస్తారు.. ఎవరు బెట్టింగ్ నిర్వహిస్తారు.. అన్న విషయాలు బహిర్గతం కాకుండా అంతా జరిగిపోతుంటోంది. ఈ పరిస్థితుల్లో శనివారం నుంచి ప్రారంభమై మే 25 వరకు జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ల్లో బెట్టింగ్‌లతో నష్టపోయి ఎంతోమంది వీధిన పడనున్నారు.



డెకాయ్ కస్టమర్లతో.. ఆపరేషన్ గరుడ

- మందుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు
- డాక్టర్ చీటీ లేకుండా మందుల విక్రయాలపై కేసులు

గుంటూరు మెడికల్, నరసరావుపేట లీగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో శుక్రవారం విజిలెన్స్, పోలీసు శాఖలతో కలసి ఔషధ నియంత్రణ శాఖ అధికారులు రిటైల్ మందుల దుకాణాలపై విస్తృత స్థాయిలో తనిఖీలు జరిపారు. ఎప్పటిలా జరిపే మొక్కుబడి తనిఖీల్లా కాకుండా ఈ దఫా.. ముందస్తుగా మఫ్టీలో ఉన్న పోలీసులను డెకాయ్ కస్టమర్లుగా (సాధారణ వినియోగదారుడుగా) దుకాణాలకు పంపారు. వీరికి సదరు దుకాణదారుడు డాక్టర్ చీటీ లేకుండా.. మత్తు బిళ్లలు, యాంటీబయోటిక్ మందులు విక్రయించడంతో.. సదరు పోలీసులనే సాక్షులుగా పెట్టి కేసులు నమోదు చేశారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఆపరేషన్ గరుడ పేరుతో మందుల దుకాణాలపై దాడులు, ఆకస్మిక తనిఖీలు జరిపినట్లు అధికారులు తెలిపారు. మత్తు మందులకు యువత బానిసలుగా మారుతున్నట్లు ఆరోపణలు రావడం, పలువురు రిటైల్ డ్రగ్గిస్టులు ఈ చట్టవి రుద్ధంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టామన్నారు. గుంటూరులో మూడు, పల్నాడులో రెండు, బాపట్లలో రెండు మందుల షాపులపై కేసులు నమోదు చేసినట్లు గుంటూరు జిల్లా విజిలెన్స్ ఎస్పీ దువ్వారపు సూర్యశ్రావణ్‌కుమార్ తెలిపారు. గుంటూరులో జరిగిన తనిఖీల్లో సీఐలు చంద్రశేఖర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు. నరసరావుపేట బరం పేటలోని భవ్య శ్రీ మెడికల్ షాప్ గోడౌన్లో అనుమ తులు లేకుండా భారీ స్థాయిలో ఔషధాలు నిల్వ ఉంచినట్లు గుర్తించిన అధికారులు వాటిని సీజ్ చేసినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో నరసరా వుపేట రూరల్ సీఐ పీ రామకృష్ణ, డ్రగ్ ఇన్స్పెక్టర్లు మంగమ్మ, పద్మ, విజిలెన్స్ ఏఈ శివనారాయణ, ఎఫ్ఆర్‌వో సైదులు పాల్గొ న్నారు. మత్తు బిళ్లలు, మత్తు ఇంజక్షన్ల ఘటనలు వెలుగుచూసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మందుల దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బాపట్లలో అధికారుల తనిఖీలతో కొంతమంది షాపులు మూసివేశారు.

ఈ దాడుల్లో ఈగల్ టీమ్ హెడ్ విక్టర్, సీఐ కోటేశ్వర రావు, పట్టణ సీఐ ఆర్. రాంబాబు, విజిలెన్స్ అధికారి ఆదినారాయణచౌదరి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి. సాంబశివరావు పాల్గొన్నారు.



గుంటూరులో ఓ దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

భలే చౌక బేరం..



ఉచిత బియ్యానికి.. రూ.12

రేషన్ బదులు లబ్ధిదారులకు నగదు

- జిల్లాలో యథేచ్ఛగా మాఫియా దందా
- నగదు బదిలీ కేంద్రాలుగా ఎండీయూలు
- పోటీ పడి మరీ బొక్కేస్తున్న అక్రమార్కులు
- పాలక పార్టీ నేతల అండతో బరితెగిస్తున్నారు
- గుంటూరులో బియ్యం సేకరణకు సిండికేట్ వేలం
- పల్నాడు జిల్లాలో రేషన్ డీలర్లే దళారుల అవతారం
- బాపట్ల జిల్లాలో నెలవారీ కప్పం.. దర్జాగా అక్రమార్జన

ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే బియ్యానికి విలువ పెరుగుతోంది. బియ్యం సేకరణలో పోటీ పెరగడం.. మాఫియా రంగ ప్రవేశంతో పేదలకు వచ్చే రేషన్‌లో బియ్యం అందడంలేదు. బియ్యం బదులు నగదు చేతిలో పెట్టేస్తున్నారు. గతంలో రేషన్ బియ్యం తీసుకుని దానిని తినలేక అమ్ముకునేవారు. కానీ గత కొంతకాలంగా అసలు బియ్యం ఇవ్వకుండానే లబ్ధిదారులకు నేరుగా నగదు ఇచ్చేస్తున్నారు. బియ్యాన్ని రేషన్ రాబందులు తన్నుకుపోతున్నాయి. రేషన్ షాపులకు వచ్చిన బియ్యం ఆ షాపుల్లోనే మాయం చేసేస్తున్నారు. కొందరు అధికారు లకు.. అధికార పార్టీ నేతలకు నెలవారీ మామూళ్లు ఇస్తున్నా రన్న ఆరోపణలున్నాయి. రేషన్ పంపిణీపై అధికారుల పర్య వేక్షణ పూర్తిగా కొరవడింది. నెలవారీ తనిఖీలు నిర్వహిం చడాన్ని కూడా వారు విస్మరించారు. ఐదేళ్లు వైసీపీ నేతల కను సన్నల్లో జరిగినట్లుగానే ప్రస్తుత అధికార పార్టీ నేతలు బియ్యం దందాను కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ నేతలు కొందరు బియ్యం అక్రమ వ్యాపారాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారన్న ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పేదల ఇళ్లలో ఉడకాల్సిన రేషన్ బియ్యం.. పెద్దలకు రూ.కోట్లు కురిపిస్తోంది. రూ.కోట్ల ఆదాయం కనిపిస్తుండటంతో అక్రమార్కులు సిండికేట్‌గా మారి ఎక్కడికక్కడ బియ్యాన్ని సేకరించి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత ఐదేళ్లలో ఊహించని రీతిలో పట్టణాల నుంచి గ్రామాల వరకు పాకిన బియ్యం మాఫియా పేదల బియ్యాన్ని మింగేస్తోంది. ఈ క్రమంలో అధికారులు అక్రమాలను అడ్డుకోకుండా మామూళ్లతో మాయ చేస్తున్నారు. ప్రాంతాల వారీగా బియ్యం దందాను వ్యవస్థీకృతం చేయడంలో వైసీపీ నేతలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో ప్రస్తుత పాలకపార్టీ నాయకుల తీరు ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ దందాలో ఎవరైనా బయటి వ్యక్తులు ప్రవేశిస్తే నేతలే అధికారులకు ఫిర్యాదు చేసి వారిని కట్టడి చేస్తున్నారు. కొందరు నేతలు రేషన్ బియ్యాన్ని ఆదాయ వనరుగా మార్చేసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ప్రతీ నెలా వేలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలిపోతోంది. బియ్యం కోటాకు బదులుగా ఎండీయూ వాహన దారులు కిలోకు రూ.12 వరకు లెక్క గట్టి మరీ కార్డుదారులకు నగదు ఇస్తున్నారు.

అధికారం అండ.. మాఫియా బరితెగింపు..

అధికార పార్టీ నేతల అండదండలతో బియ్యం అక్రమ వ్యాపారం విరాజిల్లుతోంది. కార్డు దారులకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం నిల్వల్లో సగం వరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నదంటే ఆశ్చర్యం కాదు. గుంటూరుకు చెందిన ఇద్దరు మాఫియా పెద్దలు మొత్తం గుంటూరు జిల్లాలోని రేషన్ మాఫియానంతటినీ శాశిస్తున్నారన్న విషయం సర్వత్రా విదితమే. తెనాలిలో వైసీపీ ఎంపీటీసీ ఎండీయూ వాహన ఆపరేటర్ ముసుగులో బియ్యాన్ని నలబజారుకు తరలిస్తూ ఇటీవల పట్టుబడటం అక్రమార్కుల బరితెగింపునకు నిదర్శనంగా కనిపిస్తోంది. తెనాలి ప్రాంతంలో రైస్ మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని (మిగతా 8వ పేజీలో)

పల్నాడులో నెలకు రూ.11 కోట్ల వ్యాపారం

వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో కొన్ని మిల్లులను అక్రమార్కులే నిర్వహిస్తున్నారు. జిల్లా లో ప్రతి నెలా 78,743 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తుండగా అందులో 40 నుంచి 50 శాతం బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్లు అంచనా. టోకు వ్యాపారి కిలో రూ 28 బియ్యం కొనుగోలు చేస్తుండగా ఈ ప్రకారం దాదాపు ప్రతి నెలా రూ.10 నుంచి 11 కోట్లకు బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతున్నట్టు అంచనా. బియ్యం అక్రమ వ్యాపారంలో నెల నెలా రూ.కోట్లల్లో ముడుపులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లాలో ఓ చోట నెలకు రూ.27 లక్షలు చెల్లిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరి కొన్ని చోట్ల నెలకు రూ.20 లక్షల వరకు చేతులు మారుతున్నట్టు సమాచారం. ఓ శాఖలోని కొందరు అధికారులకు నెలకు రూ 2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు మాముళ్ల చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. మరో శాఖకు సంబంధించి రూ.50 వేల వరకు మామూళ్లు ఇస్తున్నారని సమాచారం. డీలర్ల నుంచి సేకరించిన బియ్యాన్ని సరిహద్దులు దాటించడం లేదంటే మిల్లుల్లో పాలిష్ పట్టి బస్తాల్లోకి మార్చి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అక్రమార్కులు పోటీ పడిన చోట డీలర్లకు రేటు ఎక్కు వుగా లభిస్తున్నట్లు సమాచారం.

నరసరావుపేటలో.. వైన్స్ వార్

- వివాదాలకు తావిస్తోన్న ఎక్సైజ్ శాఖ
- బార్ మూత.. ఎక్సైజ్ అధికారులకు తాళాలు
- వైన్స్ వద్ద రెస్టారెంట్ నిర్వహించకుండా చర్యలు



నరసరావుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో మద్యం వ్యాపారుల మధ్య కోల్డ్‌వార్ జరుగుతుంది. వైన్స్, బార్లు నిర్వహించే విషయంలో మద్యం వ్యాపారుల మధ్య నెలకొన్న వివాదం ముదిరి పాకాన పడింది. వివాదానికి ఎక్సైజ్ శాఖ కారణమన్న విమర్శలున్నాయి. నెలవారీ మామూళ్ల దండు కుంటూ అధికారులు మిన్నకుండటంతోనే వ్యాపారులు రోడ్డెక్కారన్న ఆరోపణలున్నాయి. స్థానిక పల్నాడు రోడ్డులో వారాహి బార్ రెస్టారెంట్, జనతా వైన్స్ ఉన్నాయి. అయితే వైన్స్‌ను బార్ తరహాలో నిర్వహిస్తున్నారు. దీంతో వారాహి బార్ నిర్వాహకులు ఎక్సైజ్ అధికారులకు జనతా వైన్స్ తీరుపై ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు చర్యలు తీసుకోకుండా వారికి అండగా ఉండటంతో శుక్రవారం బార్‌కు తాళాలు వేసి మూసి వేశారు. అనంతరం తాళాలను ఎక్సైజ్ అధికారులకు అందచేశారు. ఈ నేపథ్యంలో ఎప్పుడూ లేనివిధంగా జనతా వైన్స్ వద్ద రెస్టారెంట్ నిర్వహించకుండా అధికారులు కాపలా ఉన్నారు. ఎక్సైజ్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. వారాహి బార్, జనతా వైన్స్ నిర్వహకులు టీడీపీకి చెందిన వారే. పైగా ఇద్దరూ ఒకే సామాజిక వర్గీయులు. దీంతో వీరి మధ్య వైరం పార్టీ నేతలకు తలనొప్పిగా మారింది. ఈ పంచాయితీ పార్టీ పెద్దల వద్దకు వెళ్లిందని తెలిసింది. ఈ వివాదం పార్టీకి నష్టం చేకూర్చేదిగా ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎక్సైజ్ శాఖ నిబంధనలు అమలు చేస్తే ఇటువంటి వివాదలకు తావుండదని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇరు వర్గాల మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు నేతలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇన్ని రోజులు సిట్టింగ్, రెస్టారెంట్‌కు అనుమతించిన ఎక్సైజ్ అధికారులు శుక్రవారం హడావుడి చేయడం గమనార్హం. చిలకలూరిపేట తరహాలో నరసరావుపేటలో కూడా బార్, వైన్స్‌లు సిండికేట్‌కు ప్రయత్నాలు జరిగాయి. కలసికట్టుగా వ్యాపారం చేసుకోవాలని వైన్స్, బార్ల నిర్వాహకులకు అధికార పార్టీ ముఖ్య నేత సూచించారు. అయితే అందరూ అందుకు అంగీకరించినా జనతా వైన్స్ నిర్వాహకులు వ్యతిరేకించారని సమాచారం.

ఎస్సీ, ఎస్టీల కోసం నేడు గ్రీవెన్స్

కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా పరిష్కార వేదిక

నరసరావుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల కోసం శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. జిల్లాలోని దళితులు, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



నిందితుడి వివరాలను తెలుపుతున్న డీఎస్పీ జనార్ధనరావు పక్కన సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ ప్రకాశరావు తదితరులు

విజయబాబుపై పీడీ యాక్ట్

- డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి, మారీసుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో పలు కేసులలో వున్న స్థానిక యడ్లలింగయ్య కాలనీకి చెందిన తలవరస విజయబాబుపై పీడీ యాక్ట్ పెట్టినట్టు డీఎస్పీ బి జనార్ధనరావు తెలిపారు. శుక్రవారం పట్టణ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జనార్ధనరావు మాట్లాడుతూ, నిందితుడు తన నేరప్రవృత్తిని మార్చుకోకుండా చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనడంతో ముందస్తుగా అదుపులోకి తీసుకున్నామన్నారు. విజయబాబుపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో 14 కేసులు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మరొక కేసు ఉందని వివరించారు. నిందితుడిని జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా ఆరు నెలలు రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఐ ఎస్ రమేష్‌బాబు, ఎస్ఐ ఎన్ ప్రకాశరావు పాల్గొన్నారు.

29న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న జరగనుంది. ఈ నెల 15వ తేదీన సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీలు బాయ్‌కాట్ చేసిన సంగతి తెలిసిందే. అందువల్ల కోరం లేకపోవడంతో ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సమావేశాన్ని వాయిదా వేశారు. అందువల్ల జడ్పీ వార్షిక బడ్జెట్ ఆమోదానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో తిరిగి 29న సమావేశం ఏర్పాటు చేశారు.

రాజధానిలో నైపుణ్యం కలిగిన వాళ్లకు మంచి డిమాండ్

సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు



సమీక్ష నిర్వహిస్తున్న స్పెషలాఫీసర్ కే కన్నబాబు

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పరిధిలో భారీగా నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్న దృష్ట్యా అందుకు తగ్గ నైపుణ్యం కలిగిన వారి అవసరం ఎంతో ఉందని జిల్లా స్పెషలాఫీసర్, సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు అన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఎస్‌డీసీ) ద్వారా నిరుద్యోగులకు అవసరమైన శిక్షణనిచ్చి సిద్ధం చేయాలన్నారు. స్కిల్ ఉంటే తప్పక ఎక్కువ వేతనంతో కూడిన ఉద్యోగం, ఉపాధి లభిస్తుందని స్పష్టం చేశారు. ఇటీవలే జిల్లా ప్రత్యేకాధికారిగా నియమితుడైన కన్నబాబు శుక్రవారం సాయంత్రం గుంటూరు నగరానికి వచ్చి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలలో అమలు జరుగుతున్న కార్యక్రమాల పురోగతి, ప్రణాళికలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

స్పెషలాఫీసర్ కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పెన్షన్ల పంపిణీని ఎలాంటి రిమార్కులు లేకుండా సమయానికి అందించాలని సూచించారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అధికారులందరు సమన్వయంతో అమలు చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా హోమ్ కంపోస్టింగ్‌పై ప్రజలకు అవగాహన కలిగించేందుకు మున్సిపల్ అధికారులు ప్రోత్సహించాలన్నారు. ఇందుకు గాను ఒక ప్రత్యేకమైన డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. దీపం పథకం-2 ద్వారా ప్రజలకు ఉచితంగా అందిస్తున్న గ్యాస్ బండ వివరాలను సివిల్ సప్లయిస్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రోడ్లు, డ్రెయిన్ల వివరాలను డ్వామా పీడీ శంకర్ వివరించారు. హౌసింగ్, వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్య, పశు సంవర్ధకం, పరిశ్రమల శాఖలలో చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షిస్తూ ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు.

జిల్లాలో చేపడుతున్న గుంతల రహిత రోడ్ల నిర్మాణం పురోగతిపై ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీనివాస మూర్తి వివరిస్తూ దాదాపు 98 శాతం పనులు పూర్తి అయ్యాయని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ప్రతి సోమవారం జిల్లా, మండల కేంద్రాలు, మున్సిపాలిటీలలో నిర్వహిస్తూ ప్రజల నుండి వినతులు స్వీకరించి పరిష్కరించడం జరుగుతున్నదని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నోడల్ అధికారి గంగరాజు ప్రత్యేక అధికారికి వివరించారు. డివిజన్, జిల్లా రాష్ట్ర స్థాయిలలో పీజీఆర్ఎస్‌లో అందిన పిటీషన్ల పరిష్కారంపై ఆడిట్ టీములు ఏర్పాటు చేసి మానిటర్ చేయడం జరుగుతున్నదని వివరించారు. అనంతరం జిల్లాలో చేపట్టవలసిన, జరుగుతున్న మేజర్ ప్రాజెక్ట్ పనులపై సమీక్ష జరిగింది. శంకర్ విలాస్ వద్ద ఆర్ఓబి బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించి వున్న చిన్నపాటి అవరోధాలను పూర్తి చేసి ఈ నెలాఖరు లోపు పరిష్కరించి నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని ఆర్ అండ్ బి ఎస్ఈ ప్రత్యేక అధికారికి ఈ సందర్భంగా వివరించారు.



సీఐఎస్ఎఫ్ బృందంతో డిప్యూటీ కమాండెంట్ హ్రిషబ్

తీరంలో సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ

చెరుకుపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సీఐఎస్ఎఫ్ 56వ వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా తీరప్రాంతాలలోని మత్స్యకారులకు అవగాహన కల్పించడానికి సైక్లోథాన్-2025పేరుతో సైకిల్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమాండెంట్ హ్రిషబ్ తెలిపారు. శుక్రవారం ఈ బృందం చెరుకుపల్లిలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో విశ్రాంతి కోసం ఆగారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ హ్రిషబ్ మాట్లాడుతూ తమ ఈ సైకిల్ యాత్ర కేంద్ర హోమంత్రి అమిత్ షా సూచనతో ఈ నెల 7వ తేదీన ప్రారంభమయ్యిందని ఈనెల 31న కన్యాకుమారి చేరడంతో ముగుస్తుందని చెప్పారు. ఈ యాత్ర రెండురూట్లలలో జరుగుతుందని తూర్పుతీరప్రాంతంలో ఒక బృందం, పశ్చిమ తీరప్రాంతంలో ఒకబృందం యాత్ర చేస్తుందని చెప్పారు. ఈ యాత్ర ముఖ్యఉద్దేశం తీరప్రాంత గ్రామాలలోని మత్స్యకారులకు గత విధుల గురించి వివరిస్తామన్నారు. ముఖ్యంగా డ్రగ్స్ నార్కోటిక్స్, తీవ్రవాదుల రవాణా గురించి వివరించామన్నారు. తీరప్రాంతంలో ఎవరైనా అనుమానితులు కనబడితే దగ్గరలో ఉన్న కోస్టుగార్డుకిగాని, పోలీస్‌స్టేషన్‌గాని తెలియజేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజల నుంచి తమ సైకిల్‌యాత్రకు అపూర్వమైన మద్దతు లభిస్తుందని దానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ అరవింద్‌శర్మ, అమిత్‌కుమార్, బృందం సభ్యులు 85 మంది, ఎస్ఐ టి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో రౌడీషీటర్‌కు 8 నెలల శిక్ష

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో రౌడీషీటర్‌కు ఎక్సైజ్, ప్రొహిబిషన్ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి స్పందన ఎనిమిది నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలలోకి వెళితే....2017జనవరి 22న తేదీన సాయంత్రం 07:00 గంటలకు రౌడీషీటర్ పాదర్తి రమేష్ ఎస్‌వీఎన్ కాలనీలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేసి అతని నుంచి 250 గ్రాముల గంజాయి స్వాదీనం చేసుకున్నారు. పట్టాభిపురం పోలీసుల కేసు దర్యాప్తులో నిందితుడు గంజాయి విక్రయాన్ని ఆదాయ వనరుగా చేసుకొని జీవిస్తున్నాడని తెలిసింది. నిందితుడు పాదర్తి రమేష్‌పై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ కూడా నమోదు కావడంతో అతనిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడి మీద అప్పటికే పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో నమోదైన మోసం కేసులో గుంటూరు జిల్లా జైలు లో శిక్ష అనుభవిస్తుండగా అతడిని జైలు నుంచి నేరుగా కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో రమేష్‌ను దోషిగా నిర్దారించి, నిందితుడికి న్యాయమూర్తి స్పందన ఎనిమిది నెలల పాటు కఠిన జైలు శిక్ష విధించారు.

మన్నెయ్యను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు



మన్నెయ్యను కోర్టుకు తీసుకువస్తున్న పోలీసులు

మాచర్లటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన వైసీపీ నేత ఊరబండి మన్నెయ్యను పోలీసులు మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు. గతేడాది మే 8వ తేదీన జంగమహేశ్వరపాడులో నాటుబాంబుల కేసులో మన్నెయ్య నిందితుడు. ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడు కావడంతో పీడీ యాక్ట్ అమలు కావడంతో మన్నెయ్య రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ కేసులో వాయిదా నిమిత్తం పోలీసులు రాజమండ్రి జైలు నుంచి తీసుకొచ్చి మాచర్ల కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి పి ప్రశాంత్ వచ్చే నెల 4వ తేదీకి వాయిదా వేశారు. కాగా కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని మన్నెయ్య తరపు న్యాయవాది రామానాయక్ పిటీషన్ వేయగా న్యాయమూర్తి ప్రశాంత్ ఐదు నిమిషాలు మాట్లాడుకునేందుకు అనుమతినిచ్చారు. అనంతరం మన్నెయ్యను పోలీసు ఎస్కార్ట్‌తో దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ రాజమండ్రికి తరలించారు.

ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు కారణంగా రద్దు చేసిన పలు ప్యాసింజర్ రైళ్లని శనివారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాచీగూడ - మిర్యాలగూడ - కాచీగూడ ప్యాసింజర్ రైళ్లను శుక్రవారమే పునరుద్ధరించామన్నారు. శనివారం నుంచి నడికుడి - మిర్యాలగూడ - నడికుడి, విజయవాడ - గుంటూరు - విజయవాడ రైళ్లను పట్టాలెక్కిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్చరీ ఛాంపియన్ షిప్ ప్రారంభం

పెదకాకాని, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో నిర్వహిస్తున్న లెనిన్ ఓల్గా మెమోరియల్ అండర్ 13, అండర్ 10 ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం యూనివర్సిటీలో ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవ సభకు ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె గంగాధరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆర్చరీ పోటీలకు ఏఎన్‌యూ వేదిక కావడం ఆనందదాయకమన్నారు. భవిష్యత్‌లో ఆర్చరీ విలువిద్యకు యూనివర్సిటీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఈ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు మంచి ప్రదర్శనను ఇవ్వడం ద్వారా తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి ప్రసంగిస్తూ క్రీడారంగ అభివృద్ధికి యూనివర్సిటీలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం మాట్లాడుతూ ఆర్చరీ క్రీడను రానున్న రోజుల్లో ఏఎన్‌యూలో ప్రత్యేకంగా ప్రోత్సహిస్తామన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి అండర్ 13 విభాగంలో 700 మంది బాలబాలికలు పాల్గొంటున్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు

ఉమ్మడి జిల్లా వక్ఫ్ అధికారిగా మొహమ్మద్ హుస్సేన్

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వక్ఫ్ అధికారిగా మొహమ్మద్ హుస్సేన్‌ని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవో నియమించారు. ఉమ్మడి గుంటూరుతో పాటు ప్రకాశం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలకు కూడా ఆయన్నే బోర్డు నియమించింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 519.60 అడుగులు ఉంది. ఇది 148.54 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7190 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,023 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పిడుగురాళ్లలో నకిలీ పెయింట్స్ తయారీ

- నంద్యాల, బాపట్ల తనిఖీల్లో గుర్తింపు

పిడుగురాళ్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల అంటేనే మినీ ముంబాయిగా పేరుంది. ఎక్కడ వస్తువు అయినా క్షణాలలో అదే పోలికతో తయారు చేయడం ఇక్కడ కొందరికే దక్కుతుంది. దాంతో పిడుగురాళ్లను మినీ ముంబాయిగా పిలుస్తుండేవారు. రాష్ట్రంతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలలో నకిలీ నోట్ల చలామణి, నకిలీ సున్నం, నకిలీ పెయింట్స్ కూడా పిడుగురాళ్ల నుండే పలురకాల ప్రముఖ కంపెనీల పేరుతో ఇక్కడి నుండి మార్కెట్‌కు తరలిస్తుంటారు. గురువారం నంద్యాల, బాపట్ల జిల్లాల్లో ఏషియన్ కంపెనీ ప్రతినిధులు, పోలీసుల సంయుక్త దాడిలో అచ్చం ఏషియన్ పెయింట్స్ పోలినట్లుగా తయారైన నకిలీ పెయింట్స్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇన్‌వాయిస్, బిల్లులకు తయారీ ప్రాంతానికి ఎంతో తేడా వున్నట్లు కూడా పోలీసులు గుర్తించడం జరిగింది. నంద్యాలలో ఓ వ్యాపారిపై కేసు కూడా నమోదు చేసిన పోలీసులు ఆ వ్యాపారి ఇచ్చిన సమాచారం మేరకు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుండి కొందరు సున్నం వ్యాపారులు, ఇటీవల పెయింటింగ్ రంగంలోకి దిగి అచ్చం ఒరిజినల్‌లాగానే గుర్తుపట్టలేని విధంగా ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ పెయింట్స్‌ను తయారు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నట్లుగా గురువారం నంద్యాల, బాపట్లలో వెలుగులోకి రావడంతో పిడుగురాళ్లలో ఆ వ్యవహారాన్ని నడుపుతున్న కొందరు శుక్రవారం అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. మొత్తం మీద పిడుగురాళ్ల వేదికగా గుంటూరు రోడ్డులో, పట్టణంలోని పలు ప్రాంతాలలో ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు, మరికొందరు అరకొర అనుమతులతో విచ్చలవిడిగా పెయింట్స్‌ను తయారు చేసి ప్రజలకు, వ్యాపారులకు అంటగడుతున్నట్లు తెలుస్తుంది. గత ఏడాది గుంటూరు రూట్‌లో వున్న ఓ పెయింటింగ్ మిల్లులో ఓ బాలుడు తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటనపై కొందరు వ్యాపారులు బాలుడి తల్లిదండ్రులను బెదిరించి విషయాన్ని బయటకు రాకుండా చేయడమే కాకుండా అప్పటి పోలీసులకు పెద్ద ఎత్తున మాముళ్లు పంచారనే ఆరోపణలు వున్నాయి. ఏది ఏమైనా నంద్యాల, బాపట్లలో కంపెనీ ప్రతినిధులు, పోలీసులు సేకరిస్తున్న సమాచారంతో పిడుగురాళ్లకు వున్న లింకేమిటో ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

శ్రీరామా రూరల్ ప్రధానోపాధ్యాయురాలికి సమన్విత అవార్డు



ఉమారాణి

కొల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సమన్విత 2025 అవార్డుకు శ్రీరామా రూరల్ విద్యా సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి ఎంపికయ్యారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించనున్న ఈ అవార్డు ప్రదాన కార్యక్రమానికి భారతదేశంలో వివిధ రంగాలలో పని చేస్తున్న 9 మంది సమన్విత 2025 ప్రభావశీలులైన మహిళలుగా ఈ అవార్డును అందుకోనున్నారు. సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ అనే ప్రభుత్వేతర సంస్థ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యురాలు కమల్‌జిత్ సెహ్రావత్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డు ప్రదానం చేయనున్నారు. అవార్డుకు ఎంపికైన ఉమారాణి 1986 నుంచి శ్రీరామాలో గణిత ఉపాధ్యాయురాలిగా, ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఈమె శ్రీరామా పూర్వ విద్యార్థి కావడం విశేషం. గడిచిన నాలుగు దశాబ్ధాలుగా ఎన్నో వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఆమెకు ఈ అవార్డు దక్కడంపై విద్యా సంస్థ విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పల్నాడులో ప్రశాంతంగా దూరవిద్య పరీక్షలు

నరసరావుపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పల్నాడుజిల్లా వ్యాప్తంగా పదోతరగతి రెగ్యులర్, దూరవిద్య పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శుక్రవారం జరిగాయి. మూడో రోజు ఇంగ్లీషు పరీక్షకు జిల్లాలో మొత్తం 128 పరీక్షా కేంద్రాలలో 25,346 విద్యార్థులకు 25,111 మంది హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 24 మంది హాజరు అయ్యారు. 128 పరీక్షా కేంద్రాలను పరిశీలించడానికి 22 సిట్టింగ్, 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి పరీక్షలు-మార్చి 2025 జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలలో జరిగిన తెలుగు, ఉర్దూ పరీక్షకు 1151 మంది విద్యార్థులకు 1013 మంది విద్యార్థులు 88శాతం హాజరయ్యారు. 27 పరీక్షా కేంద్రాలను పరిశీలించడానికి 14 సిట్టింగ్, 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. డిస్ట్రిక్ట్ లెవెల్ అబ్జర్వర్ జాయింట్ డైరెక్టర్ ఎన్ గీత చిలకలూరిపేట పట్టణంలోని 11 పరీక్షా కేంద్రాలు సందర్శించారు. డీఈవో ఎల్ చంద్రకళ గురుజాల, రెంటచింతల మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. జిల్లాలో 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 75 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీఈవో చంద్రకళ

రెంటచింతల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను డీఈవో చంద్రకళ, పరిశీలకుడు జనార్ధన్ పరిశీలించారు. వీరి వెంట ఎంఈవో - 2 శివనాగేశ్వరరావు ఉన్నారు.

శనివారం మధ్యాహ్నం కల్లా సమస్య పరిష్కారం: ఎమ్మెల్యే

రెంటచింతల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం కల్లా వివిధ మేజర్లకు నీటి విడుదల పెంచుతావని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హామి నిచ్చారు. శుక్రవారం ఆంధ్రజ్యోతితో ఫోన్లో మాట్లాడుతూ ఇప్పటికే ఎస్ఈ కృష్ణమోహన్‌తో మాట్లాడామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండలంలోని మల్లవరం మేజర్ కింద సాగవుతున్న వివిధ పైర్లు ఎండుముఖం పట్టాయి. ఒక తడి ఇస్తే పైర్లను కాపాడుకోవచ్చని రైతులంటున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సీతారత్నం మృతదేహాన్ని పరిశీలించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ

పిడుగురాళ్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మాచవరం పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తూ గురువారం రాత్రి బ్రాహ్మణపల్లిలో హత్యకు గురైన సీతారత్నం మృతదేహాన్ని శుక్రవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ రవి పరిశీలించారు. సంఘటన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఉపాధి గ్రామసభలు

● 28న మండల స్థాయిలో ప్రజావేదిక

మాచవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 22వ తేదీ నుంచి 27 వరకు ఉపాధి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీవో వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో గత సంవత్సరం జరిగిన పనులకు సంబంధించి తనిఖీలు నిర్వహించామని, ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి నివేదికలు తయారుచేస్తామన్నారు. అనంతరం మండలస్థాయిలో ఈనెల 28వ తేదీన ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.

పీ-4పై గ్రామసభలు : ఎంపీడీవో

మాచవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పీ-4 సర్వేపై అన్ని గ్రామాల్లో గ్రామసభలు శనివారం నిర్వహించాలని ఎంపీడీవో వెంగళరావు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను శుక్రవారం ఆదేశించారు. ఈ గ్రామసభల్లో 20శాతం గుర్తించిన నిరుపేదల జాబితాలను సభలో చదివి వినిపించాలని, ప్రజలకు అందుబాటులో జాబితాను ఉంచాలన్నారు.

ఉగాది పురస్కారానికి అగ్నిమాపక శాఖాధికారి ఎంపిక

పిడుగురాళ్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల అగ్నిమాపక శాఖాధికారి కుమార శ్రీనివాసరావు రాష్ట్ర ఉగాది పురస్కారం-2025కు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం శ్రీనివాసరావుకు సమాచారం అందించింది. గత 38 సంవత్సరాలుగా అగ్నిమాపకశాఖలో సేవలందిస్తున్న శ్రీనివాసరావుకు ఉగాది పురస్కారాన్ని ప్రకటించడం పట్ల జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీధర్ అభినందనలు తెలియజేశారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

● పరిహారం కోసం రహదారిపై ఆందోళన

పిడుగురాళ్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కరాలపాడు-పెదగార్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామానికి చెందిన రోశయ్య (38) భార్యతో కలిసి కరాలపాడులో భవననిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. శుక్రవారం ద్విచక్రవాహనంపై పనికి వెళ్లివస్తుండగా కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో రోశయ్య మృతిచెందాడు. భార్య మేరికుమారి కాలు విరిగింది. రోశయ్య కుటుంబానికి సహాయం అందించడంలో కారు యజమాని నిర్లక్ష్యం వహించడంతో బాధితులు సినిమాహాలు సెంటర్ వద్ద అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై ఆందోళన చేపట్టారు. పిడుగురాళ్ల ఎస్ఐ శివనాగరాజు మృతుని కుటుంబసభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులు

నకరికల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 22వ తేదీ శనివారం కుంకలగుంట, రూపెనగుంట్ల గ్రామాల్లో ఆధార్‌లో మార్పులు, చేర్పులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఈవోపీఆర్‌డీ కేవీఎస్ ప్రసాదు తెలిపారు. ఈనెల 24వ తేదీ నకరికల్లులో ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

నకరికల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులోని సభ్యులందరూ ఈనెల 31వ తేదీ లోగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ పుల్లారావు కోరారు. నకరికల్లు మండలంలో 6,540మంది, నకరికల్లులో 1263 మంది, గుండ్లపల్లిలో 1235మంది, కుంకలగుంటలో 655మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు.

27న పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక

రాజుపాలెం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం, ఉప్పలపాడు, కొత్తబోధనం, అనుపాలెం, అంచులవారిపాలెం గ్రామాలలో ఈ నెల 27న ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యానారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉపసర్పంచ్ పదవులు ఖాళీకావటంతో ఎన్నిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కారంపూడి మండలంలో...

కారంపూడి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీగా ఉన్న 8 గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌ల ఎన్నిక ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి కసిన్యానాయక్ శుక్రవారం తెలిపారు. ఎన్నికల అధికారుల నియామకం కూడా జరిగిందన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

రాజుపాలెం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రెడ్డిగూడెం గ్రామం వద్ద వైన్స్‌షాపు సమీపంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మొక్కపాడు గ్రామానికి చెందిన పేర్లపాటి నాగేశ్వరరావు (42) జీవనోపాధి నిమిత్తం దోడ్లేరు గ్రామంలో నివసిస్తున్నాడు. నాగేశ్వరరావు ఈ నెల 18వ తేదీన ఇంటి నుండి బయటకు వచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అదేరోజు మద్యం సేవించి మత్తులో కిందపడి చనిపోయి ఉంటాడని చెబుతున్నారు. శుక్రవారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వేణుగోపాల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉప్పలపాడులో రైతులు ఆరబోసిన మిరపకాయలు

ఘాటెక్కిన మిర్చి

● తెగుళ్లతో తగ్గిన దిగుబడి
● పడిపోయిన ధరలు
● రైతుల్లో ఆందోళన

రాజుపాలెం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం మిరపకు వాతావరణం బాగా అనుకూలించి మంచి దిగుబడులు రావడంతో పాటు ధరలు కలిసొచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మిరపపంట వైపు ఎక్కువమంది రైతులు మొగ్గుచూపారు. అధిక విస్తీర్ణంలో మిరప సాగుచేశారు. తొలుత క్వింటా రూ20వేలు ఉండటంతో ఎంతో ఆనందించారు. తీరా పంట చేతికొచ్చేసరికే ధరలు తగ్గాయి. అదే సమయంలో ఖర్చులు బాగా పెరిగాయి. గతంలో ఎకరాలో పంట సాగుచేస్తే రూ50వేల వరకు పెట్టుబడి అయ్యేది. ఈ సంవత్సరం ఆ మొత్తం రెట్టింపైంది. దీంతో ఏంచేయాలో తెలియని స్థితిలో రైతులు సతమతమవుతున్నారు.

3500 ఎకరాలలో సాగు విస్తీర్ణం

మండలంలోని పలు గ్రామాల రైతులు మిరప పంటనే ఎక్కువగా సాగు చేశారు. ఆకులగణపవరం, బలిజేపల్లి, రాజుపాలెం, రెడ్డిగూడెం, మొక్కపాడు, ఉప్పలపాడు, కొత్తూరు, బీరవల్లిపాయ, అనుపాలెం గ్రామాలలోని రైతులు మిరప పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాలలో మొత్తం సుమారు 3500 ఎకరాలలో మిరప పంటను సాగు చేస్తున్నారు. పంట పూత, పిందె దశలో నల్లతామర ఆశించింది. దీంతో నివారణకు రోజు మార్చి రోజు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడులు బాగా పెరిగిపోయాయి. అందుకు అనుగుణంగా దిగుబడి మాత్రం రాలేదు. ఎకరాకు 15 నుండి 20 క్వింటాళ్ల వరకు వస్తాయని ఆశించినా చీడపీడల ప్రభావంతో పది క్వింటాళ్లే వస్తున్నాయి. ఒకపక్క ధర, దిగుబడి తగ్గి మరోవైపు సాగువ్యయం పెరగటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన కూలీల ధరలు

ఈ సంవత్సరం మొదట్లో మిరపకూలీలకు ఒక్కొక్కరికి రూ.350 ఉండగా ప్రస్తుతం రూ.450 చెల్లిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. 15మంది కూలీలు రోజుకు క్వింటా కాయలు కోస్తున్నారు. వారికి అవుతున్న ఖర్చు రూ.6750. అంతేగాక కూలీలను పొలం వద్దకు చేర్చేందుకు వాహన బాడుగలు, తాలు కాయలు ఏరేందుకు మరో రూ.4వేల వరకు ఖర్చు. ప్రస్తుతం మార్కెట్‌లో మిరప క్వింటా ధర సుమారు రూ.13వేలు పలుకుతోంది.

ఎకరాకు రూ.లక్ష నష్టం: రైతు అప్పారావు, ఆకులగణపవరం

నేను ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో మిరపపంట సాగుచేయగా ఎకరాలకు 20క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ప్రస్తుత ధరతో చూస్తే ఎకరాకు రూ.లక్ష నష్టం వస్తోంది.

అధికారులు పట్టించుకోలేదు: రైతు వెంకటేశ్వర్లు, రాజుపాలెం

నేను రెండు ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని మిరప పంటను సాగు చేశాను. పంట మొదటి దశలో నల్లతామర ఆశించడంతో ఉద్యానవన శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించలేదు. ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోవాలి.

పేదరిక నిర్మూలనకు సహకరించాలి

● మున్సిపల్ కమిషనర్ వేణుబాబు



సభలో మాట్లాడుతున్న కమిషనర్ వేణుబాబు

మాచర్లటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేపై నిర్వహిస్తున్న వార్డు సభల్లో ప్రజలందరూ భాగస్వాములై పేదరిక నిర్మూలనకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు కోరారు. పట్టణంలోని 1 నుంచి 6 వార్డులకు శుక్రవారం నెహ్రూనగర్‌లోని ఎంపీపీ స్కూల్‌లో నిర్వహించిన వార్డు సభలో ఆయన మాట్లాడారు. పీ4 సర్వేలోని పేదలకు ప్రభుత్వం ప్రైవేటు ప్రజల భాగస్వామ్యంతో వారికి ఆర్థికంగా, సామాజికంగా భద్రత కల్పిస్తూ వారి సుస్థిర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మెప్మా సీవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పురపాలక సంఘ బడ్జెట్ సమావేశం

పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం పురపాలక సంఘ 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పరీక్షా కేంద్రాల్లో డీఈవో తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గురజాలటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గురజాల మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను శుక్రవారం డీఈవో చంద్రకళ తనిఖీ చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన పది పరీక్షా కేంద్రంలో లీకేజీ కథనానికి ఆమె స్పందించారు. పల్లెగుంత మోడల్ స్కూల్‌ను పరిశీలించి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇరువురు ఇన్విజిలేటర్లను రిలీవ్ చేసినట్లు చెప్పారు. వారిపై విచారణ జరుగుతుందన్నారు. ఈ కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే గురజాల పట్టణంలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

వైద్యశాలలో నూతన భవనం పరిశీలన



ఏరియా వైద్యశాలలో నూతన భవనంలో ఏర్పాటుచేసిన బెడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో నాబార్డు నిధులతో అదనంగా నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం పరిశీలించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావుతో కలసి అన్ని గదులను ఆయన పరిశీలించారు. త్వరలో అదనపు భవనాన్ని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన ఏర్పాట్లపై సూపరింటెండెంట్ లక్ష్మణరావుతో మాట్లాడారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, కంభాల వెంకటేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, మారెళ్ళ స్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, తవిటి భవన్నారాయణ, సయ్యద్ పెద కరిముల్లా, గుంటూరు ఆశీర్వాదం, పురుషోత్తం నాయక్, రంగిశెట్టి సుమన్ తదితరులు ఉన్నారు. అనంతరం రైల్వేస్టేషన్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న మునిసిపల్ స్టేడియంను ఆయన పరిశీలించారు. అనంతరం సత్తెనపల్లి బస్టాండ్ సమీపంలో 22వ తేదీన ప్రధాన తపాలా కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగనున్న స్థలాన్ని ఎమ్మెల్యే పోస్టల్ అధికారులతో కలసి పరిశీలించారు. ఆయనతో పాటు విజయవాడ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డీఎస్ఆర్ మూర్తి, నరసరావుపేట పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి ఉన్నారు.

శక్తి యాప్‌పై విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

క్రోసూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మహిళల, చిన్నారుల భద్రతకోసం ప్రారంభించిన శక్తియాప్‌పై శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని పలు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న క్రోసూరు ఎస్ఐ నాగేంద్రరరావు మాట్లాడుతూ శక్తియాప్‌లోని ఫీచర్లు ఏ పరిస్థితుల్లో ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు. ఆపదలో చిక్కుకున్న మహిళలు యాప్ ఓపెన్ చేసి ఎస్‌వోఎస్ ఆప్షన్‌పై నొక్కితే పదిసెకన్ల నిడివిగల వీడియో, ఆడియో ఆటోమ్యాటిక్‌గా రికార్డై ఘటనాస్థలం లోకేషన్‌తో సహా పోలీసు కంట్రోల్‌రూంకు చేరుతుందన్నారు. నిమిషాల వ్యవధిలోనే పోలీసులు అక్కడికి చేరుకుంటారన్నారు. మండలంలోని ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాల, క్రోసూరు, ఊటుకూరు జడ్పీ హైస్కూ ల్, జైభారత్ హైస్కూల్ విద్యాసంస్థల్లో అవగాహన కల్పించారు.

మొక్కజొన్న పంట పరిశీలన

దాచేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విత్తనాలు మావే.. పెట్టుబడి మాదే.. పంట పండించటమే మీ వంతు అంటూ తమ చేత లక్షల రూపాయల పెట్టుబడి పెట్టించారు.. తీరా సాగుచేసిన మొక్కజొన్న పంటలో తాలుకండెలు వచ్చాయి. జరిగిన నష్టంపై న్యాయం చేయాలని కోరుతూ బాధిత రైతులు వ్యవసాయ అధికారులకు మొరపెట్టుకున్నారు. శుక్రవారం మండలంలోని శ్రీనగర్ గ్రామంలో రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రెంటచింతల గ్రామానికి చెందిన విత్తన వ్యాపారి మొక్కజొన్న సాగు చేయండి, పండిన పంటను మేమే కొనుగోలు చేస్తాం అంటూ నమ్మబలికారు. దీంతో 200 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశామని, ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంటకు కండెలు తాలుగా వచ్చాయి. కోతకోసిన మొక్కజొన్న కండెల్లో విత్తనాలు లేకపోవటం, కండెలన్నీ తాలుగా ఉండటం చూసిన రైతులు జరిగిన నష్టంపై పోలీసు, వ్యవసాయ అధికారులకు ఫిర్యాదుచేశారు. రైతుల ఫిర్యాదు మేరకు వ్యవసాయ శాఖ అధికారులు శ్రీనగర్‌కి చేరుకొని పంటపొలాలను పరిశీలించారు. మొక్కజొన్న సాగుచేయాలని, కండెలను కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చిన వ్యక్తిపై కూడా రైతులు ఫిర్యాదు చేశారు. వ్యవసాయశాఖ ఏవో పాపకుమారి పంట పొలాలను పరిశీలించి రైతుల నుంచి ఆధారాలను, రికార్డులను తయారు చేశారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

25న రుణమేళా

● ఎంపీడీవో సరోజనిదేవి

రెంటచింతల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారంతా ఈనెల 25న జరగనున్న రుణమేళాకు హాజరుకావాలని ఎంపీడీవో కె సరోజనీదేవి చెప్పారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న పత్రాలన్నింటిని తీసుకుని రావాలని, వివిధ బ్యాంక్ మేనేజర్లు ఈ కార్యక్రమానికి హాజరౌతారని పేర్కొన్నారు.

ఈకేవైసీ లేకుంటే రేషన్‌కార్డు రద్దు

తహసీల్దార్ ఫణీంద్రకుమార్

దుర్గి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ లేకుంటే రేషన్‌కార్డు రద్దవుతుందని తహసీల్దార్ ఫణీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమావేశమై మాట్లాడారు. భూరీ సర్వేలు పారదర్శకంగా ఉండాలని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫిర్యాదులు అందితే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు కమిటీ సభ్యుడిగా జూలకంటి నియామకంపై హర్షం

కారంపూడి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలు కమిటీ సభ్యునిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నియామకం పట్ల కారంపూడి కూటమి నేతలు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసినవారిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ ఎంపీపీ కొంగర లక్ష్మీనారాయణ, బీసీ నేత లింగాల శ్రీనివాసరావు, కజ్జం పెద ఆంజనేయులు, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి పేదవారికి కొండంత అండ

● ఎమ్మెల్యే ప్రవీణ్



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదవారికి కొండంత అండ అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే 49మందికి రూ.54,58,123 సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెదకూరపాడు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు మండలాల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, నందిగం ఆశీర్వాదం, మల్లాది విష్ణు, బాషాలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమావేశం

మాచర్ల రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఓటర్ల జాబితాపై నియోజకవర్గ స్పెషలాఫీసర్, పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ గాయత్రిదేవి ఆధ్వర్యాన రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఓటరు లిస్టు, పోలింగ్ కేంద్రాలపై నేతలు పలు సూచనలు చేశారు. ఓటరు ఐడీలోని ఫోటోలపై ఓటరుకు అవగాహన కల్పించాలని గాయత్రిదేవి నేతలకు సూచించారు. ఈ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో నిర్వహిస్తున్న స్పెషలాఫీసర్ గాయత్రిదేవి

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 29.97 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

పెదకూరపాడు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి శుక్రవారం గుర్తింపుకార్డుల పంపిణీ వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల టీడీపీ అధ్యక్షులు మల్లాది విష్ణు, అర్తిమళ్ళ రమేష్, బాషా, నందిగం ఆశీర్వాదం పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెదకూరపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీ ఉదయం 11గంటలకు జరుగుతుందని ఎంపీడీవో రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

సభా నిర్వహణ తీరు తెలుసుకో జగన్

మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి

మాచర్లటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలు ఎలా నిర్వహించాలో కూటమి ప్రభుత్వంలో ముగిసిన సమావేశాల తీరు చూసి జగన్ లాంటి నాయకులు నేర్చుకోవాలని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే సభ హుందాగా నడుస్తుందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కౌరవ సభలా ఉండేదని, ఇప్పుడు గౌరవసభలా ఉందన్నారు. వైసీపీ పాలనలో సమావేశాలు అరకొరగా జరిగేవన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభలో ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి తప్పించుకు తిరగడం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి ఎమ్మెల్యేలకు జీతభత్యాలు తీసుకునే అర్హత లేదన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు తిక్కా కొండలు, దుర్భాకుల ప్రసాద్, బొట్టు కోటేశ్వరరావు, గాజుల ఆంజనేయులు, మస్తాన్, మల్లెల శివ, దేవరశెట్టి బ్రహ్మం, దేవళ్ల సదా తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

సత్తెనపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవైష్ణవి ప్రగతి జూనియర్ డిగ్రీ కళాశాల నూతన యాజమాన్యం శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్‌కు రూ 50వేల విరాళాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే కన్నాకు అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దగ్గుపాటి శివబ్రహ్మరెడ్డి, శ్రీనివాసాచారి, ఎం సుబ్బరాజు, షేక్ బాషా, సోమేశ్వరరావు, డేగల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాన్ష్ పుట్టిన రోజు వేడుకలు

సత్తెనపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు మనవడు నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం పరివర్తన పాఠశాలలో టీడీపీ శ్రేణులు నిర్వహించాయి. కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దరువూరి ఆనంద్, బిక్కి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వరమే సేవలందించాలి

సత్తెనపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సచివాలయానికి వచ్చే ప్రజలకు ఉద్యోగులు సత్వరమే సేవలు అందించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం పట్టణ సచివాలయ నూతన కార్యవర్గం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కన్నాను సత్కరించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ప్రభుత్వానికి, పట్టణానికి మంచి పేరు తీసుకువచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు చిలుకా ప్రదీప్, ఘంటా శ్రీను, మునాఫ్, పుణ్యవతి, గౌతమి, రవిచంద్ర, సైదా, భవానీ, నళిని, కవిరాజు, లక్ష్మీ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు డీఎం అండ్ హెచ్‌వో పరామర్శ



మత్స్యకార కుటుంబాలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

మాచవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత వెల్లంపల్లిలో కృష్ణానది ఒడ్డున నివశిస్తున్న మత్స్యకార కుటుంబాలను డీఎం అండ్ హెచ్‌వో రవి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల మత్స్యకార కుటుంబాలకు చెందిన ముగ్గురు పిల్లలకు మలేరియా జ్వరం రావటంతో మాచవరం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న డీఎం అండ్ హెచ్‌వో పాత వెల్లంపల్లి గ్రామానికి చెందిన మత్స్యకార కుటుంబాలతో మాట్లాడి ముగ్గురు పిల్లల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎంవో రత్నాకర్, స్థానిక వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం

క్రోసూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో అనారోగ్యంతో మరణించిన టీడీపీ కార్యకర్త నక్కా నాగయ్య మృతికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఫోన్ ద్వారా కుటుంబసభ్యులను పరామర్శించారు. స్థానిక టీడీపీ నాయకులు మొగల్‌జాన్ ద్వారా మట్టిఖర్చుల కోసం ఆర్థికసాయం అందించారు. మృతదేహానికి జనసేన, టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

రూ.35 లక్షలతో పరారైన రియల్ ఎస్టేట్ బ్రోకర్లు

● పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితుడు

మాచర్లటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మీ పొలం అమ్మిపెడతాం.. మీకు మంచి రేటు ఇప్పిస్తాం.. అంటూ మాయమాటలు చెప్పి ఓ రైతు వద్ద రూ.35 లక్షల నగదుతో బ్రోకర్లు పరారైన సంఘటన మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం ముటుకూరు గ్రామంలో జరిగింది. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, తూగూడ గ్రామానికి చెందిన బండెల నరసింహారెడ్డి అనే రైతు దుర్గి మండలం ముటుకూరు గ్రామ శివారులో 6.88 ఎకరాలు మెట్ట పొలం కొనుగోలు చేశాడు. కుటుంబ అవసరాల నిమిత్తం తన పొలం అమ్మేందుకు మాచర్లకు చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్లు లింగారెడ్డి, అతని స్నేహితుడు మల్లేష్ యాదవ్‌ను ఆశ్రయించాడు. వారు మాదాసు వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి విక్రయ అగ్రిమెంట్ చేయించి అడ్వాన్సుగా రూ.8.90 లక్షలు ఇప్పించారు. మిగిలిన నగదును రిజిస్ట్రేషన్ రోజు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈనెల 15వ తేదీన నరసరావుపేట రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం రూ.35లక్షల నగదును మధ్యవర్తిగా వ్యవహరించిన మల్లేష్ యాదవ్ తీసుకొని కారులో మాచర్ల వచ్చిన తర్వాత ఇస్తానని బండెల నరసింహారెడ్డితో నమ్మబలికి మాచర్ల వచ్చారు. నరసింహారెడ్డిని మాచర్లలో దించివేసి మల్లేష్‌యాదవ్ కారులో నగదుతో పరారయ్యాడు. ఈ విషయాన్ని అతనితో కలిసి వచ్చిన లింగారెడ్డికి చెప్పగా రూ.20లక్షలు తమ కమీషన్ కింద తీసుకున్నామని, మిగిలిన రూ.15లక్షలు ఇప్పిస్తామని నరసింహారెడ్డికి తెలిపాడు. ఆ తరువాత ఫోన్లుచేసినా లింగారెడ్డి, మల్లేష్‌యాదవ్‌లు స్పందించకపోవడంతో బాధితుడు నరసింహారెడ్డి మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్లో మూడురోజుల క్రితం ఫిర్యాదు చేశాడు. తనను లింగారెడ్డి, మల్లేష్‌యాదవ్‌లు మోసంచేశారని, పొలంఅమ్మగా వచ్చిన రూ.35 లక్షల నగదును తీసుకెళ్లి నీకు చేతనైంది చేసుకో.. నీకు దిక్కున్నచోట చెప్పుకో అంటూ బెదిరించారని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



జీఎంసీ-జీజీహెచ్ మధ్య ..సొరంగ మార్గం!

● నగర పాలక సంస్థను కోరిన జీఎంసీ ప్రిన్సిపాల్

గుంటూరు మెడికల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల నుంచి ప్రభుత్వ సమగ్రాస్పత్రి వరకు భూగర్భంలో సొరంగ మార్గం ఏర్పాటు చేయాలని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి శుక్రవారం గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుకు నగర పాలక సంస్థ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. త్వరలో రూ.98 కోట్లతో నూతనంగా నిర్మించనున్న శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జ్ వల్ల మూడేళ్ల పాటు జీఎంసీ, జీజీహెచ్ మధ్యరోడ్డులో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని వారు కమిషనర్‌కు వివరించారు. ప్రతి రోజూ వెయ్యి మంది వైద్య విద్యార్థులు, (ఫస్ట్ ఇయర్ నుంచి ఫోర్త్ ఇయర్ వరకు), 511 మంది మెడికల్ పీజీ విద్యార్థులు, 45 మంది సూపర్ స్పెషాలిటీ విద్యార్థులు, 150 మంది పారా మెడికల్ విద్యార్థులు, మరో 230 మంది పారా మెడికల్ డిప్లమో విద్యార్థులు క్లినికల్ శిక్షణ కోసం జీఎంసీ నుంచి జీజీహెచ్‌కు రావాల్సి ఉంటుందన్నారు. 1936 మంది వైద్య విద్యార్థులు, పారా మెడికల్ విద్యార్థులలతో పాటు 500 మంది రోగులు వైద్యపరీక్షల కోసం జీజీహెచ్ నుంచి జీఎంసీ పెథాలజీ, మైక్రోబయాలజీ విభాగాలకు వస్తుంటారు.

శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం...

ప్రస్తుతం నిర్మించే నూతన బ్రిడ్జి వల్ల మూడేళ్ల పాటు జీఎంసీ, జీజీహెచ్ మధ్య రహదారి మూసుకుపోతుందని, దీని వల్ల ప్రతి రోజూ వేలాది మంది మెడికోలు, పీజీలు, రోగులు ఇబ్బందులు పడతారని ప్రిన్సిపాల్ వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వైద్య కళాశాల నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు భూగర్భంలో సొరంగ మార్గం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. మెడికల్ కాలేజీ నుంచి పోలీస్ ఇన్‌స్పెక్టర్ బంగ్లా వరకు దారి ఉందని, కేవలం పోలీసు ఐబీ నుంచి సుమారు 50 గజాల దూరం వరకు ప్రభుత్వాస్పత్రి పీజీ క్వార్టర్స్ వరకు సొరంగ మార్గం ఏర్పాటు చేస్తే సరిపోతుందని డాక్టర్ సుందరాచారీ వివరించారు. ఈ మార్గం శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తే భవిష్యత్తులో బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిన తర్వాత కూడా సొరంగ మార్గం వినియోగించుకుంటారని ఆయన తెలిపారు. అంతకు ముందు గురువారం డాక్టర్ సుందరాచారీ, కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి ఈ ప్రతిపాదన తెలిపారు. ఆయన వెంట జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్ల డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ ఉన్నారు.

పత్తికి ప్రాణం పోద్దాం

● అఖిల భారత కాటన్ వార్షిక సమావేశంలో శాస్త్రవేత్తలు

● గులాబీ పురుగు విజృంభణ, దిగుబడి తగ్గుదల పై ఆందోళన

● ఆంధ్రాలో పూర్తిగా పడిపోయిన సాగు విస్తీర్ణం



ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన భారత పత్తి వార్షిక సమావేశం-2025లో పాల్గొన్న డాక్టర్ సీడీ మాయి, వీసీ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మీ, నాగ్‌పూర్ ఐసీఏఆర్ - సీఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ జి. ప్రసాద్, డాక్టర్ ఎస్.కె. శుక్లా, డాక్టర్ పీవీ సత్యనారాయణ తదితరులు

గుంటూరు సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంభవించిన వాతావరణ మార్పులతో జీవచ్ఛవంలా మారిన పత్తికి ప్రాణం పోయాల్సిన తరుణం ఆసన్నమైందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. గుంటూరు సమీపంలోని లాం ఫామ్‌లోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అఖిల భారత పత్తి వార్షిక సమావేశం-2025 శుక్రవారం ఆరంభమయింది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశంలో జాతీయ స్థాయికి చెందిన 160 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన భారతదేశ పత్తి మనిషిగా పిలువబడే డాక్టర్ సీడీ మాయి మాట్లాడుతూ దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి ప్రారంభించిన మొదటి 'టెక్నాలజీ మిషన్ అఫ్ కాటన్' దేశంలో సాగు రూపురేఖలు మార్చిందన్నారు. అప్పుడు ప్రవేశపెట్టిన మొదటి మిషన్‌లోనే బీటీ పత్తి వంగడం రూపుదిద్దుకున్నది చెప్పారు. దాని ఫలితంగా పత్తి పంటలో ఉత్పత్తి, ఉత్పాదకత, లాభదాయకత పెరిగాయన్నారు. కొన్ని దశాబ్దాల తర్వాత గులాబిరంగు పురుగు తిరిగి రావడం ఆందోళనకరమన్నారు. దాన్ని తట్టుకొని, వాతావరణ పరిస్థితులను ఎదిరించే నూతన వంగడాల సృష్టి ద్వారానే దేశ భవిష్యత్ వస్త్ర అవసరాలు తీర్చగలమని పేర్కొన్నారు. నూతనంగా ఆరంభం కానున్న రెండవ మిషన్ లో 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' నినాదాన్ని ముందుకు తీసుకుపోవాలని అన్నారు. ఈ మిషన్ ఉత్పాదకత, సుస్థిరతను పెంపొందించడం, అతి పొడవైన స్టేపుల్ పత్తి రకాల సాగును (పొడవు పింజ పత్తి) ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యంగా పత్తి దిగుమ తులపై భారతదేశం ఆధారపడటాన్ని దృష్టిలో ఉంచుకొని వార్షిక దిగుమతులు 3 మిలియన్ బేళ్లను మించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. స్వదేశీ ఉత్పత్తిని పెంచడానికి తక్షణ విధి విధానాలు అవసరమని చెప్పారు. విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మీ మాట్లాడుతూ భారతదేశంలో పత్తి కాయతొలిచే పురుగును సమర్థవం తంగా నియంత్రించడం ద్వారా పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడంలో బీటీ వంగడాలు సమర్థవంతంగా పనిచేశాయని అన్నారు. ఎన్ జీ రంగా విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసి విడుదల చేసిన పత్తి రకం 'నరసింహ (ఎన్ ఏ-1325)' గణనీయమైన విజయాన్ని సాధించినదని అన్నారు. నాగ్‌పూర్ ఐసీఏఆర్ - సీఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ జి. ప్రసాద్ మాట్లాడుతూ పత్తి ఉత్పత్తి 15 సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరుకుందని, ఒకప్పుడు రెండవ అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారుగా ఉన్న ఏకీకృత ఆంధ్రప్రదేశ్ ప్రాంతం ఇప్పుడు వాతావరణ మార్పుల కారణంగా సాగు విస్తీర్ణం తగ్గుతుందని పేర్కొన్నారు. డాక్టర్ ఎస్.కె. శుక్లా మాట్లాడుతూ భారతీయ పత్తిలో అధిక కలుషిత స్థాయిలపై ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ ప్రశాంత కుమార్ దాస్ మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితులలో పత్తి నిరోధకతను, ఉత్పాదకతను పెంచడానికి జన్యుమార్పిడి సాంకేతికత చాలా అవసరమని అభిప్రాయ పడ్డారు.

రాష్ట్రంలో పాతాళానికి పడిపోయిన పత్తి సాగు..

ఆంధ్రప్రదేశ్‌లో పత్తి సాగు విస్తీర్ణం పాతాళానికి పడిపోయింది. 2001-2002 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో 10.02 లక్షల హెక్టార్లలో పత్తి సాగుచేయగా, 2023-2024 సంవత్సరంలో సాగు విస్తీర్ణం 4.27 లక్షలకు పడిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్తి విస్తీర్ణం, దిగుబడి పూర్తిగా పడిపోయినట్లు వార్షిక సమావేశం-2025 నివేదిక స్పష్టం చేసున్నది. పత్తి ధరల పతనం, గులాబీ రంగు పురుగు వల్ల రైతాంగం ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

మత్తులో ఎస్కార్ట్ పోలీసులు.. రిమాండ్ ఖైదీ పరారీ

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చేతులు తడిపితే మందు, మగువతో రిమాండ్ ఖైదీలు రాజభోగాలు అనుభవించవచ్చని ఎస్కార్ట్ పోలీసులు నిరూపించారు. ఓ చోరీ కేసులో బాపట్ల జైల్లో ఉన్న ఇద్దరు రిమాండ్ ఖైదీలను బాపట్లకు చెందిన ఏఆర్ పోలీసులు ఎస్కార్టుగా గురువారం గుంటూరు జిల్లా కోర్టుకు తీసుకువచ్చారు. కోర్టులో వాయిదా అనంతరం తిరిగి వారిని బాపట్ల జైలుకు తరలించేందుకు గుంటూరు బస్టాండ్‌కు తీసుకెళ్లారు. అయితే బస్టాండ్ ఎదురుగా ఉన్న లాడ్జిలో రిమాండ్ ఖైదీలు ఇద్దరు మహిళలతో ఎంజాయ్ చేశారు. ఆ సమయంలో పోలీసులు పక్కనే ఉన్న బార్‌లో మద్యం మత్తులో మునిగి తేలుతున్నారు. ఇదే అదునుగా భావించిన ఓ రిమాండ్ ఖైదీ పారిపోయాడు. ఆలస్యంగా విషయం గ్రహించిన ఎస్కార్ట్ పోలీసులు పరారైన నిందితుడ్ని పట్టుకునేందుకు శుక్రవారం వరకు ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో చేసేదేమీ లేక శుక్రవారం కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ..డోర్ డెలివరీ

● డోర్ డెలివరీ చేయలేమంటూ చేతులెత్తేసిన యాజమాన్యం

● నెల రోజుల పాటు ప్రచారానికే పరిమితం



గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని కార్గో పార్శిల్ కార్యాలయం

గుంటూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో పార్శిల్ సంస్థ డోర్ డెలివరీలో వెనుకంజ వేసింది. పార్శిల్ ఉత్పత్తులను డోర్ డెలివరీ చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసిన ఆ సంస్థ అమల్లో మాత్రం విఫలమైంది. డోర్ డెలివరీకి అనుగుణంగా మానవ వనరులు సమకూర్చటంలో సరైన ప్రణాళికలు లేకపోవటంతోనే యాజమాన్యం చేతులెత్తేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర విభజన అనంతరం ఆర్టీసీ సొంతంగా 2016 నుంచి కార్గో పార్శిల్ సంస్థకు శ్రీకారం చుట్టింది. వస్తువులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా 24 గంటల్లో చేరేలా ప్రణాళికలు రూపొందించింది. వస్తు రవాణా గ్యారంటీ, నమ్మకంతో కూడిన వ్యాపారం కార్గో నిర్వహిస్తోంది. సరుకు రవాణాపై కిలో మీటర్ల దూరం, వస్తువు బరువును బట్టి ఛార్జీ నిర్ణయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రం గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో కార్గో పార్శిల్ రవాణా సంస్థకు నిత్యం ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఇక్కడ నుంచి నిత్యం జిల్లాలోని పట్టణ ప్రాంతాలతో పాటు ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, అనంతపూర్ ప్రాంతాలకు పెద్ద ఎత్తున సరుకు రవాణా జరుగుతుందని అధికారులు తెలిపారు. ఆర్టీసీ డిపోలతో పాటు జిల్లా వ్యాప్తంగా 20 మందికి పైగా ఆథరైజ్డ డీలరతో కమీషన్ ప్రాతిపదికన కార్గో పార్శిల్ ఏజంట్ల ద్వారా సరుకు రవాణా చేస్తున్నారు. ఇత గత ఏడాది ఆర్థిక సంవత్సరంలో రూ.12.21 కోట్లతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉమ్మడి జిల్లా ఉండగా ప్రస్తుతం గత డిసెంబరు నాటికి దాదాపు రూ. 9 కోట్ల ఆదాయంతో వ్యాపార లావాదేవీలు జరిగాయి. ఇదే సమయంలో కార్గో డోర్ డెలి వరీకి కూడా శ్రీకారం చుట్టింది. అయితే అమలుకు సంబంధించి ప్రణాళికలు రూపొం దించటంలో విఫలమైందన్న విమర్శలు ఉన్నాయి. ఒకే రూట్‌లో వివిధ ప్రాంతాల్లో డోర్ డెలివరీ ఆర్డర్లు ఉంటే కలిసి వస్తుందని, ఎక్కడో ఒక ప్రాంతంలో డోర్ డెలివరీ ఆర్డర్ పడితే పింపంచటం కష్ట తరంగా మారుతుందని ఆ సంస్థలో ఓ అధికారి తెలిపారు. డోర్ డెలివరీకి వేసే ఛార్జీ, అక్కడకు చేరే నాటికి అయ్యే ఖర్చు డబుల్ అవుతుందని అందుకే డోర్ డెలివరీ వెనుకాడాల్సి వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

డోర్ డెలివరీపై ప్రచారానికే పరిమితం....

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీపై ఈ ఏడాది జనవరిలో నెల రోజుల పాటు విస్తృత ప్రచారాలు చేపట్టారు. కార్గోలో పార్శిల్‌తో పాటు డోర్ డెలివరీ కూడా ఉందంటూ ఫ్లెక్సీలతో ప్రచారాలు చేపట్టారు. ఇందు కోసం నెల రోజుల పాటు ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఆ నెల రోజుల పాటు డోర్ డెలివరీ చేసిన అధికారులు తరువాత మాత్రం నిలిపివేశారు. ప్రస్తుతం డోర్ డెలివరీ అడిగితే లేదంటూ సమాధానం చెప్పటంతో అనేక మంది వెనుది రిగిపోతున్నారు. అయితే డోర్ డెలివరీకి అవసరమైన మానవ వనరులను సమకూర్చుకోవటంలో విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

భలే చౌక బేరం

(5వ పేజీ తరువాయి)

పాలిష్‌పట్టి తరలిస్తుండగా గతంలో పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. తెనాలి ప్రాంతంలో సేకరించిన బియ్యాన్ని ఎక్కువగా పల్నాడు, గోదావరి జిల్లాల లోని వ్యాపారులకు రూ.20 వరకు అమ్ముతు న్నారు. వేమూరు, అమృత లూరు, చుండూ రు మండలాల్లోని రైస్ మిల్లులను లీజుకు తీసుకుని అక్రమ వ్యాపారానికి అడ్డాగా మారుస్తున్నారు. పల్నాడు జిల్లాలో డీలర్లు దళారుల అవతారం ఎత్తి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమార్కులకు అందజేస్తున్నారు. జిల్లాలో బియ్యం అక్రమ వ్యాపారం రూ.11 కోట్లు సాగుతుండగా మామూళ్లు కూడా అదే స్థాయిలో చేతులు మారుతున్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గతంలో పౌర సరఫరాల మంత్రి మనోహర్ తనిఖీలు చేసినప్పటికీ మాఫియా దోపిడీలో ఎలాంటి మార్పు లేదు. బియ్యం మాఫియా అక్రమాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా, మీడియాలో కథనాలు వస్తున్నా అధికారులు కనీసం కూడా పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. బాపట్ల జిల్లాలో గడచిన ఆరు నెలల వ్యవధిలో బియ్యం దొంగలపై 103 వరకు 6ఏ కేసులు నమోదు చేయగా 4180 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. అయినా ఈ కేసులేవీ వారి దందాను అడ్డుకోలేకపోతున్నాయి. తూతూ మంత్రంగా దాడులు.. మొక్కుబడి కేసులు తప్పితే బియ్యం మాఫియా మూలాలను అరికట్టడంపై అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. అధికారులు ఎవరిపై దాడులు చేయాలో కూడా నేతలే నిర్దేశించే స్థాయికి బియ్యం మాఫియా వేళ్లూనుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

బియ్యం బ్లాక్ మార్కెట్ ఇలా..

ఎక్కడికక్కడ కార్డుదారులకు ఎండీయూ వాహనదారులు, డీలర్లు రూ.12 వరకు నగదు ఇచ్చి బియ్యాన్ని సేకరిస్తున్నారు. వీరి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కులు కిలో రూ.14 నుంచి రూ.16 వరకు కొనుగోలు చేస్తున్నారు. స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని బియ్యం తరలిస్తున్నారు. కొన్ని చోట్ల మిల్లులను లీజుకు తీసుకుని సేకరించిన బియ్యానికి ఒక పట్టు పాలిష్ వేసి గోతాలు మారుస్తున్నారు. దీనిని టోకు వ్యాపారి కిలోకు రూ.28 ఇచ్చి అక్రమార్కుల నుంచి కొనుగోలు చేస్తున్నాడు. మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. గతంలో కాకినాడ పోర్టుకు తరలించేవారు. కాకినాడ పోర్టులో తనిఖీల నేపథ్యంలో బియ్యం బ్లాక్ మార్కెట్ రూటు మారింది. ప్రస్తుతం గుజరాత్‌కు తరలిస్తున్నట్లు అక్రమార్కులు బహిరంగంగానే చెబుతున్నారు.

అభివృద్ధికి ఇసుక గ్రహణం

● ప్రభుత్వ పనులకు ఇసుక కొరత.. ● ప్రారంభంకాని ఇసుక రీచ్‌లు





నరసరావుపేట మునిసిపాల్టీలో ఇసుక కొరతతో నిలిచిపోయిన రహదారి నిర్మాణం, నరసరావుపేటలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రగతిపై ఇసుక ప్రభావం పడింది. పంచాయతీలు, మునిసిపాలిటీలలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇసుక గ్రహణం పట్టింది. జిల్లాలో ఇసుక రీచ్‌లను మైనింగ్ శాఖ మూసివేసింది. ప్రభుత్వం పల్లె పండుగలో బాగంగా సిమెంట్ రోడ్లు.. మురుగు కాలవల నిర్మాణాలు చేపట్టారు. మునిసిపాల్టీలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటిపై ఇసుక ప్రభావం పడింది. దీంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోతున్నాయి. నెల రోజులగా ఇసుక కొరత ఉందని సదరు అధికారులు చెబుతున్నారు. పొల్యూషన్ అనుమతులు లేకపోవడంతో గత నెల 6న ఇసుక రీచ్‌లు నిలిపివేసినట్లు మైనింగ్ శాఖ అధికారులు తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణంపై కూడా ఇసుక ప్రభావం పడింది.

ఇసుక సరఫరా కాకపోతుండటంతో ఇళ్ల నిర్మాణాలు కూడా నిలిచిపోతుండటంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆరు రీచ్‌లను మైనింగ్ శాఖ నిర్వహించింది. వీటిలో పొందుగ రీచ్‌లో లక్ష్యాల మేర ఇసుక తవ్వకాలు జరిగాయి. మిగతా రీచ్‌లలో పూర్తి స్థాయిలో ఇసుక తవ్వకాలు జరగలేదు. ఐదు రీచ్‌ల నిర్వహణకు పొల్యూషన్ అనుమతులు లేదు. దీంతో మైనింగ్ శాఖ రీచ్‌లను మూసివేసింది. అనుమతులు వచ్చే వరకు అధికారికంగా ఇసుక రీచ్‌లను నిర్వహించే పరిస్థితులు లేవని సదరు అధికారులు తెలిపారు.


నరసరావుపేట మునిసిపాల్టీలో 10 ప్రగతి పనులు చేపట్టినట్టు ఇంజనీరింగ్ విభాగం అధికారి తెలిపారు. నెల రోజులుగా ఇసుక సరఫరా కాకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. చేపట్టిన పనులకు సుమారు మూడు వేల టన్నుల ఇసుక అవసరం ఉందని సదరు అధికారులు మైనింగ్ శాఖకు లేఖ రాశారు. దీనిపై నేటి వరకు స్పందించిన దాఖలాలు లేవు. అలాగే పేదలకు ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లు ఇసుక లేక నిలిచిపోతున్నాయి.

గృహనిర్మాణ శాఖ కూడా దాదాపు 8,500 టన్నుల ఇసుక అవసరం ఉందని మైనింగ్ శాఖకు ప్రతిపాదనలు పింపింది. పల్లెల్లో చేపట్టిన ప్రగతి పనులు కూడా నిలిచిపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా పొల్యూషన్ అనుమతులు పొంది ఇసుక రీచ్‌లు ప్రారంభిస్తేనే ప్రగతి పనులు ముందుగు సాగే పరిస్థితి. ఈ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి.

విద్యుత్ సౌధ బృందానికి ఓవరాల్ ఛాంపియన్‌షిప్

గుంటూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ఉత్సాహంగా సాగుతున్న విద్యుత్‌శాఖ ఇంటర్ సర్కిల్ మహిళా ఉద్యోగుల క్రీడా, సాంస్కృతిక పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్స్ స్పోర్ట్స్ కౌన్సిల్, విజయవాడ వారి ఆధ్వర్యంలో మూడు రోజులుగా పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. క్రీడా పోటీలు ఎన్‌టీఆర్ స్టేడియంలో, పాటలు, నాటికలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు సంగడిగుంట విద్యుత్ భవన్ ఆవరణలో సందడి వాతావరణంలో జరిగాయి. కాగా టోర్నమెంట్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విజయవాడలోని విద్యుత్ సౌధ మహిళా ఉద్యోగులు సాధించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో జరిగిన ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందజేశారు. సీపీడీసీఎల్ డైరక్టర్స్ జీవీటీఎస్ ప్రసాద్ (టెక్నికల్), ఎ రామ్‌దాస్ (ఫైనాన్స్), ఆపరేషన్స్ సర్కిల్స్ ఎస్ఈలు కేవీఎల్ఎన్ ప్రసాద్ (గుంటూరు), ఆంజనేయులు (బాపట్ల), విజయ్‌కుమార్ (పల్నాడు), ఇంధనశాఖ మంత్రి ఓఎస్‌డి ఏవీ సాంబశివరావు, ఈఈలు తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, జె హరిబాబు, నాగేశ్వరరావు పలువురు అధికారులు హాజరయ్యారు.

ముగిసిన విద్యుత్‌శాఖ మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు



ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీ అందుకున్న మహిళా ఉద్యోగులు



సత్తెనపల్లిలోని సచివాలయాలకు చేరిన ఎల్-1 స్కానర్లు

పింఛను పక్కా.. అవినీతి ఉండదిక

● సచివాలయాలకు చేరిన ఎల్-1 స్కానర్లు

● ఏప్రిల్ నుంచి వాటి ద్వారానే పంపిణీ

సత్తెనపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక పింఛన్‌ల పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా అక్రమాలను నియంత్రించేందుకు ఆధునీకరించిన ఎల్-1 స్కానర్లను జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు, సచివాలయాలకు పంపిణీ చేసింది. ఏప్రిల్ నెల నుంచి వీటి సాయంతో పింఛన్‌లు పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌లకు సంబంధించి వేలి ముద్రలు పడని లబ్ధిదారులకు ఈ నెల వరకు ఎల్ జీరో ఆర్‌డీ పరికరాల సహాయంతో పంపిణీ చేస్తారు. ఇది పూర్తి స్థాయిలో ఫలితాన్ని ఇచ్చేది కాదు. లబ్ధిదారుల వేలి ముద్రలు వేస్తున్నా ఇబ్బందులు తలెత్తేవి. దీనికి తోడు కొన్ని రాష్ట్రాల్లో నకిలీ వేలి ముద్రలు రూపొందించి పింఛన్‌లు పక్కదోవ పట్టిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆధునిక ఎల్-1 ఆర్‌డీ పరికరాలు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం సచివాలయాలకు వాటిని అందజేసింది.

ఏప్రిల్ నుంచి వినియోగం

తాజాగా అందజేసిన ఎల్-1 ఆర్‌డీ పరికరాలతోనే ఏప్రిల్ నుంచి పింఛన్ అందించనున్నారు. ఈ మేరకు యూడీఏఐ ఆధార్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించింది. దీంతో పాత పరికరాలు పని చేయవని ఆ సంస్థ ఇప్పటికే స్పష్టం చేసింది. ఏ సచివాలయంలోనైనా పరికరం పని చేయకుంటే వాటి స్థానంలో కొత్తవి ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

ఇప్పటికే ఏర్పాట్లు

కొత్తగా వచ్చిన పరికరాల ద్వారానే ఏప్రిల్ నెల నుంచి పింఛన్‌లు పంపిణీ చేయనున్నాము. ఈ ప్రక్రియ కోసం అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశాం. ఎక్కడైనా పరికరం పని చేయకుంటే వెంటనే కొత్తవి సమకూరుస్తాం.

- ఎన్ ఆనంద్ కుమార్, మునిసిపల్ కమిషనర్, సత్తెనపల్లి



నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయం

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం..

నిదానంపాటి అమ్మవారి సన్నిధి

దుర్గి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత, ఆహ్లాదం కలబోతగా నిదానంపాటి అమ్మవారి దేవాలయ ప్రాంగణం విరాజిల్లుతోంది. పల్నాడు జిల్లా దుర్గి మండలం అడిగొప్పల గ్రామ సమీపంలో అటవీ ప్రదేశాన వెలసిన నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు.. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా ప్రతి ఇంటా కొంగుబంగారమై విరాజిల్లుతోంది. నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి కీర్తి రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది. ప్రతి సంవత్సరం అమ్మవారి తిరునాళ్ల అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇరుగుపొరుగు జిల్లాల నుంచి భక్తులు ఇక్కడికి చేరుకొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కుబడులు తీర్చుకొని వెళ్తుంటారు. ప్రతి ఆదివారం వేలాది మంది భక్తులు తరలిరావడం విశేషం.

అమ్మవారి తిరునాళ్ళకు విస్తృత ఏర్పాట్లు

రేపు అమ్మవారి తిరునాళ్లను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. దీనికి దేవాదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తలనీలాలు సమర్పించేందుకు కేశఖండన శాల, తాగునీరు, వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. మొక్కులు తీర్చుకునే భక్తులు పొంగళ్లు వండుకునేందుకు షెడ్లు , భక్తులు అధిక సంఖ్యలో వస్తే వారికోసం మామిడితోటలో వంట చేసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. దానికి కావాల్సిన వంట సామగ్రి కూడా అందుబాటులో ఉంటాయి. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులతో కలిసి భోజనం చేసేందుకు కూడా అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకం. పల్నాటి ప్రాంత ప్రజలు తాము కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకు మొదటగా ఇక్కడ పూజ చేయించడం అధికంగా కనిపిస్తుంది.



పల్నాడు వార్తలు

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట

కస్తూర్బా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి మాధవీలత కోరారు. 6, 11 తరగతుల్లో చేరే బాలికలతో పాటు 7,8,9,10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చే దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని ఆమె వివరించారు.

ఏఎంజీ కళాశాలలో డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

చిలకలూరిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఉత్తర్వులు మేరకు స్థానిక ఏఎంజీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ పీ రమేష్, ఎస్‌ఐ రహమతుల్లా, ట్రాఫిక్ ఏఎస్‌ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు: చైర్మన్ రఫాని

చిలకలూరిపేట, మార్చి21(ఆంధ్రజ్యోతి): వేసవిలో పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు గైకొంటున్నామని మునిసిపల్ చైర్మన్ షేక్ రఫానీ శుక్రవారం అన్నారు. ఈ సమస్యపై ఆయన మునిసిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మునిపల్ డీఈ అబ్దుల్ రహీం, ఏఈ చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి పనులు నిర్వహించాలి : ఎంపీడీవో

యడ్లపాడు, మార్చి 21: ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు పథకం లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించాలని ఎంపీడీవో హేమలతాదేవి ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 18 గ్రామపంచాయితీల పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పున్నారావు, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఏపీవో సుందరరావు, టిఎ మాధవి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జామాయిల్ తోట దగ్ధం

యడ్లపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ జామాయిల్ తోట దగ్ధమైన ఘటన యడ్లపాడు మండలం విశ్వనాథుని కండ్రిక అగ్రహారం పరిధిలో శుక్రవారం జరిగింది. యడ్లపాడు గ్రామానికి చెందిన చెన్నుపాటి శ్రీనివాసరావు విశ్వనాథుని కండ్రిక అగ్రహారం పరిధిలో గల ఎకరన్నర విస్తీర్ణంలో జామాయిల్ సాగుచేశాడు. శుక్రవారం మధ్యాహ్నం పొలంలో మంట ఎగశాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు ఎకరం విస్తీర్ణంలోని జామాయిల్ చెట్లు దగ్ధం అయ్యాయి. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు రైతు శ్రీనివాసరావు తెలిపారు.

బాట ఆక్రమణను అడ్డుకోవాలని వినతి

వినుకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పొలాల బాట దురాక్రమణ కాకుండా చూడాలంటూ శుక్రవారం తహసీల్దార్ సురేష్‌నాయక్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. వినుకొండ పట్టణానికి సమీపాన ఉన్న తిమ్మాయపాలెం రోడ్డుకు దక్షిణం వైపు ఉన్న బండ్లబాటకు తూర్పున ఉన్న 52 ఎకరాలను కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేసి రోడ్లు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారని తూర్పు, దక్షిణం మధ్యలో ఉన్న బండ్లబాటకు అడ్డంగా ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని డి.భవన్నారాయణ, వెంకటమ్మ, కంచర్ల కొండమ్మ, ఎం.అంజమ్మ, ఎ.శంకర్, ముత్యాలపాటి వెంకటలక్ష్మి, నందిని, సీహెచ్. సత్యం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ధాన్యం లోడు బోల్తా

నూజెండ్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలచెరువులో ధాన్యం లోడు పడిపోయిన సంఘటన శుక్రవారం జరిగింది. ప్రకాశం జిల్లా నుంచి ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ చింతలచెరువులో లారీని రోడ్డు పక్కన నిలిపి టిఫిన్ చేసేందుకు హోటల్‌కు వెళ్ళిన సందర్భంలో లారీ నిలిపిన చోట నేల కుంగి లారీ పక్కకు పడి పోయింది. ఆ సమయంలో లారీలో, పరిసరాల్లో ఎవ్వరూ లేకపోవటంతో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

సెల్ఫ్ డిఫెన్స్, పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శుక్రవారం సెల్ఫ్ డిఫెన్స్, పోక్సో చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. కార్యక్రమంలో స్థానిక ప్రధాన సీనియర్ సివిల్ న్యాయ అధికారి కే.మధుస్వామి పోక్సోపై, మొదటి పట్టణ ఎస్‌ఐ అరుణ శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వసతి గృహంలో సౌకర్యాలు, ఆహారం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వసతి గృహ నిర్వాహకులు ఎస్.జయప్రద, జయలక్ష్మి, వసతి గృహ సిబ్బంది, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం

వినుకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారులు, నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎన్నికల జాబితా స్వచ్ఛీకరణ, పోలింగ్ కేంద్రాల వసతుల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, తహసీల్దార్ సురేష్ నాయక్ పాల్గొన్నారు.





కొత్తలూరులో ఇళ్లకు అడ్డంగా వేసిన పైపులు

అటకెక్కిన జల్‌జీవన్ మిషన్



గంటవారిపాలెంలో బాగుచేయని చెరువు

- కోట్లు ఖర్చుచేసినా గుక్కెడు తాగునీరివ్వని పరిస్థితి
- దుర్వినియోగమైన ప్రజాధనం
- కాంట్రాక్టర్ల జేబులు నింపిన పథకం
- నెలల వ్యవధిలోనే ఊడిపోయిన పైపులు, కుళాయిలు
- ఇళ్లకు అడ్డంగావేసిన పైపులతో రాకపోకలకు ఇక్కట్లు

శావల్యాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్‌మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు కోట్ల రూపాయల నిధులు మంజూరుచేసింది. కానీ కాంట్రాక్టర్లు పైప్‌లైన్‌లకు నాసిరకం సామగ్రిని వాడి నాసిరకం పనులతో పథకాన్ని నీరుగార్చి వారి జేబులు నింపుకొన్నారు. జల్‌జీవన్‌మిషన్ ద్వారా మండలంలోని కారుమంచిలో రూ.36లక్షలు, వయ్యకల్లులో 50లక్షలు, గుంటుపాలెంలో రూ.14లక్షలు, చిన్నకంచెర్లలో రూ.50లక్షలు, కొత్తలూరులో రూ.22లక్షలు, గంటవారిపాలెంలో రూ.48లక్షలు, వేల్పూరులో 1.81కోట్లుతో ఇంటింటికీ పైప్‌లైన్లు వేసి కుళాయిలు బిగించారు. కానీ కొన్ని నెలల వ్యవధిలోనే చాలాచోట్ల వేసిన పైపులు, కుళాయిలు ఊడిపోయాయి. దానికి తోడు తాగునీటిపథకాల నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడంతో కోట్లు ఖర్చుపెట్టినా ప్రజలకు సక్రమంగా గుక్కెడు తాగునీరు ఇవ్వలేని పరిస్థితి. కారుమంచి, వయ్యకల్లు, గుంటుపాలెం, కొత్తలూరు గ్రామాల్లో పైప్‌లైన్లు సక్రమంగా వేయకపోవడం, నాసిరకం పైపులు వాడడంతో అవి వేసిన కొద్దిరోజులకే పూడిపోవడం, ఊడిపోవడంతో రోజుకు నాలుగు బకెట్లు కూడా నీరు రావట్లేదు. గంటవారిపాలెంలో తాగునీటి చెరువు బాగుచేయకుండానే పైప్‌లైన్‌లు వేయడంతో లక్షలు ఖర్చుపెట్టినా నిరుపయోగంగా మారింది. గుంటుపాలెం పంచాయతీలోని బాస్కర్‌నగర్ వద్ద తాగునీటి చెరువు లేకుండానే తాగునీటి ట్యాంక్‌ను నిర్మించారు. దానికి వయ్యకల్లు నుంచి 3కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసి నీటిని సరఫరా చేయాల్సి ఉంది. బాస్కర్‌నగర్ మెరకపై ఉన్నందున పైప్‌లైన్‌లు వేసినా తాగునీటి పథకానికి నీరందడం ప్రశ్నార్థకంగానే మారింది. చిన్నకంచెర్లలో గతంలో తాగునీటి పథకాన్ని నిర్మించి ముండ్రువారిపాలెం, చిన్నకంచెర్ల రెండు గ్రామాలకు తాగునీటిని అందించేలా పనులు ప్రారంభించగా మధ్యలో కాంట్రాక్టర్ చనిపోవడంతో అవి నిలిచిపోయాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం ముండ్రువారిపాలెం చెరువు నుంచి చిన్నకంచెర్ల వాటర్‌ట్యాంక్‌కు పైప్‌లైన్‌లు వేసి ముండ్రువారిపాలేనికి తాగునీటిని సరఫరా చేశారు. తరువాత వైసీపీ ప్రభుత్వం చిన్నకంచెర్లలో మరో వాటర్‌ట్యాంక్ నిర్మించి గ్రామంలోని మేడి చెరువు వదిలేసి ముండ్రువారిపాలెం చెరువు నుంచి పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. దాంతో రెండు గ్రామాలకు తాగునీరు సరిపోక రెండు తాగునీటి పథకాలూ నిర్వీర్యంగా మారాయి. కొన్ని గ్రామాల్లో పైప్‌లైన్‌లు వేసేప్పుడు సిమెంట్‌రోడ్లపై గాడులు తీసి బాగున్నరోడ్లు చెడగొట్టారని, తీసిన గాడులు పూడ్చకపోవడంతో డ్రెయినేజీలకు అడ్డుపడి మురికినీరు పోక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. నీళ్ళ పైపులను భూమిలోపల వేయకుండా ఇళ్ళకు ముందు అడ్డంగా వేయడంతో ఇంట్లోకి వెళ్ళేప్పుడు వృద్ధులు, పిల్లలు వాటిని తట్టుకొని కింద పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ పనులు జరిగేప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పనులు పూర్తయ్యాక కూడా అధికారులు తొంగిచూడకపోవడంతో ఇటువంటి దుస్థితి ఏర్పడిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించి సజావుగా గ్రామాల్లోకి తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీలో ఇంతకంటే ఎక్కువ గౌరవం దక్కితే మంచిదే

మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో కన్నా టీడీపీలో ఎక్కువ గౌరవం దక్కుతుందని మర్రి రాజశేఖర్ ఆశతో ఉన్నారు, దక్కితే మంచిదే, దక్కాలని కోరుకుంటున్నా, ఆల్ ది బెస్ట్ తెలియచేస్తున్నా అని మాజీమంత్రి విడదల రజిని శుక్రవారం అన్నారు. ఇక్కడి ఆమె నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీలో రాజశేఖర్‌కు సముచితమైన ప్రాధాన్యం ఇచ్చారని, పదవులు కూడా ఇచ్చారని అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో, జగన్ హయాంలో రాజశేఖర్‌కు ఎన్నో అవకాశాలు కల్పించారని చెప్పారు. 2004లో రాజశేఖర్ చిలకలూరిపేటలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తే రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయనకు మద్దతు ప్రకటించినట్టు చెప్పారు. 2009లో తిరిగి ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చారని అన్నారు. 2014లో ఆయనకు వైసీపీ టికెట్ ఇచ్చారని చెప్పారు. ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయినా ఉమ్మడి గుంటూరు జిల్లాకు పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారని చెప్పారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక జగన్ ఆయనను పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమించారని చెప్పారు. పార్టీ ఆయనకు ఎప్పుడూ ఏమీ తక్కువ చేయలేదని అన్నారు. ఈ విషయంలో ఆయన ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ఇక గుంటూరు పశ్చిమ విషయానికి వస్తే అక్కడకు వెళ్లి పోటీ చేయాలని జగన్ ఆదేశించడంతో తాను పోటీ చేసినట్లు చెప్పారు. ఎన్నికల వ్యూహంలో భాగంగా తను అక్కడ పోటీకి ఎంపిక చేశారని చెప్పారు. రాజశేఖర్ పదేపదే గుంటూరులో తన ఓటమి గురించి మాట్లాడుతున్నారని, గెలుపు ఓటముల గురించి ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీగా మర్రి రాజశేఖర్ శాసనమండలిలో రాష్ట్రంలో రెడ్‌బుక్ పేరుతో జరుగుతున్న పాపాలను ఎండగట్టి, గొంతెత్తి ప్రశ్నిస్తే మరింత గౌరవం పెరిగేదని అన్నారు. ఎమ్మెల్సీగా ఆయన రాజీనామా చేశారని, ఇప్పుడు ఆ పదవి టీడీపీ ఖాతాలోకి వెళుతుందని చెప్పారు. మండలిలో వైసీపీ బలం కూడా తగ్గిపోతుందన్నారు.

జగన్‌కు ప్రజలు 70ఎంఎం సినిమా చూపించారు

టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి చేసిన అరాచక పాలనకు వ్యతిరేకంగా జగన్‌కు రాష్ట్ర ప్రజలు 70 ఎంఎం సినిమా చూపించారని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా నడిచిందని వైసీపీ ప్రధాన కార్యదర్శి, మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకరరెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. లాయరుకి ఎక్కువ గుమాస్తాకు తక్కువైన ఆయన వ్యాఖ్యలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. జగన్మోహనరెడ్డికి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా 70ఎంఎంలో సినిమా చూపించినా వైసీపీ నాయకుల మాటల్లో మార్పు రాలేదన్నారు. 70 ఏళ్ల రంగనాయకమ్మను, 80 ఏళ్ల సీనియర్ జర్నలిస్ట్ అంకబాబుని అర్థరాత్రి గోడలు దూకి అరెస్టు చేసినప్పుడు భావ ప్రకటనా స్వేచ్ఛ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. అధినేత చెల్లెలిపైనే అతి జుగుప్సాకరంగా పోస్టులు పెట్టిన సోషల్ మీడియా సైకోలు వర్రా రవీందర్ రెడ్డి, శ్రీరెడ్డికి తానే న్యాయసాయం అందిస్తున్నానని గొప్పగా చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. పొన్నవోలు కుటుంబంలోని మహిళలను కూడా ఇదేవిధంగా దూషిస్తే ఆయన సహిస్తాడా అని నిలదీశారు. చంద్రబాబు పాలనలో ఏరోజైనా మంత్రులు, ఎమ్మెల్యేలు మీలా అడ్డగోలుగా బూతులు మాట్లాడారా అని ప్రశ్నించారు. జగన్ హయాంలో కేసుల పేరుతో ప్రభుత్వ ఖజానా నుంచి పెద్దఎత్తున ఫీజులు కొట్టేసిన పొన్నవోలు సుధాకరరెడ్డిపై విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మున్నాభాయ్ ఎంబీబీఎస్‌గా పేరుగాంచిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాటలను ఎవరూ పట్టించుకోవాల్సిన అవసరం లేదని కనపర్తి ఎద్దేవా చేశారు.

పోలీసు కార్యాలయంలో ముస్లింలకు ఇఫ్తార్

నరసరావుపేట లీగల్, మార్చి 21, (ఆంధ్రజ్యోతి): అత్యంత కఠినమైన దీక్ష రంజాన్ ఉపవాస దీక్ష అని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం అన్నారు. పల్నాడు జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ముస్లింలకు ఆయన ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. వారితో కలిసి ఎస్పీ భోజనం చేశారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ జీవీ సంతోష్ ,నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, జిల్లాలోని ముస్లిం పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ

రొంపిచర్ల, మార్చి 21 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్లలోని మసీదులో శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇటీవల శస్త్ర చికిత్సలు చేయించుకున్న మునమాక మాజీ ఎంపీటీసీ కుంపటి రవి, కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మొండితోక రామారావులను ఆయన పరామర్శించారు. కొనకంచివారిపాలెం చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు.

కోడెల శివరాం ఆధ్వర్యంలో...

నరసరావుపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తారులో పాల్గొనడం అదృష్టంగా బావిస్తున్నానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణం కోటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆసుపత్రిలో ముస్లింలకు ఇఫ్తార్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ ముస్లింలకు మార్కెట్ యార్డు చైర్మన్‌లు, కమిటీ సభ్యులు, పట్టణ పార్టీ అధ్యక్షుడిగా, మునిసిపల్ వైస్ చైర్మన్‌గా అనేక పదవులు ఇచ్చి గౌరవించిన వ్యక్తి కోడెల శివప్రసాదరావు అన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ షేక్ మీరావలి, ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, టీడీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్, ఎంఐఎం నాయకుడు షేక్ కరీముల్లా, ముస్లిం మైనారిటీ నాయకులు, టీడీపీ కార్యకర్తలు, కోడెల అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి నడవడిక, స్నేహాలు అలవర్చుకోవాలి: కన్నా



కళాశాల వార్షికోత్సవ వేడుకలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

నరసరావుపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే మంచి నడవడిక, స్నేహాలు, అలవాట్లు అలవర్చుకోవాలని మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. నరసరావుపేట పట్టణం రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా కన్నా లక్ష్మీనారాయణ, మరో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. విశ్వవిద్యాలయం ప్రకటించిన సెమిస్టర్ ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏఎన్‌యూ యూజీ ఎగ్జామ్స్ కో ఆర్డినేటర్ ఎన్‌వీ కృష్ణారావు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావులు, కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రిడ్జి తండాలో నవోదయం-2

బొల్లాపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రిడ్జి తండాలో శుక్రవారం నవోదయ-2 కార్యక్రమాన్ని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు, గుంటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని బ్రిడ్జి తండాలో నవోదయ - 2 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా జిల్లా ఉన్నతాధికారులు మాట్లాడుతూ సారాయికి దూరంగా ఉండాలన్నారు. యువత తమ భవిష్యత్‌ను చక్కగా ఉంచు కోవాలని, చెడు మార్గాల వైపు వెళ్ళ కుండా విద్యా ఉద్యోగాల కోసం కృషి చేయాలన్నారు. సారా తయారీ, రవాణా చేయటం, సారా కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎక్సైజ్ అధికారి కే మణికంఠ, సూపరింటెండెంట్ సూర్యనారాయణ, ఎంపీడీవో సీతారామయ్య, తహసీల్దార్ ఏ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి పీ సీతారామయ్య, ఎక్సైజ్ అధికారులు డీ వెంకటేశ్వర్లు, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దాట్లవారిపాలెంలో అభివృద్ధి పనులు ప్రారంభం

నూజెండ్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాట్లవారిపాలెంలో అభివృద్ధి పనులను టీడీపీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని తలార్లపల్లి పంచాయతీ పరిధిలో శుక్రవారం దాట్లవారిపాలెంలో నూతనంగా బోర్‌వెల్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా గ్రామంలోని మురుగునీరు నిల్వ ఉండ కుండా పూడికతీత పనులు చేపట్టారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కుంటా కోటిరెడ్డి, బైలడుగు తులసీరావు, ఎం.యలమంద, ఆళ్ళ గురవారెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి చెత్తసేకరణ కేంద్రాల నిర్వహణపై శిక్షణ

శావల్యాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణపై ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు శావల్యాపురం, వినుకొండ, నూజెండ్ల మండలాలకు చెందిన ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు, గ్రీన్ మిత్రలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుద్యం మెరుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని, వినుకొండ నియోజకవర్గంలో శావల్యాపురం చెత్త సేకరణ కేంద్రాన్ని లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా ఎంపిక చేసిందన్నారు. శావల్యాపురంలో మురికికాలువల్లో పూడికతీత పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయని, ఐదు రోజుల్లో పూర్తిచేసి ఫాగింగ్ చేయిస్తామన్నారు. ఈవోపీఆర్డీ సుగుణ, పంచాయతీ కార్యదర్శి యాకోబు పాల్గొన్నారు.

వెనుకబడిన తరగతుల అభ్యున్నతే ప్రధాన ధ్యేయం

● జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్, మార్చి 21, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పీ4 ముఖ్య ఉద్దేశం గ్రామాల్లో బాగా వెనుకబడిన వారిని గుర్తించి వారి అభ్యున్నతికి అభివృద్ధి చెందిన వారి ద్వారా సహకారం అందించటమే ముఖ్య ఉద్దేశం అని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పీ4 విధానంపై స్వచ్ఛంద సంస్థలు నుంచి అభిప్రాయ సేకరణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అర్థగణాంక అధికారి శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ ఏడీ నవీన్ కుమార్, సామాజిక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు

● మొక్కజొన్న దిగుబడి తగ్గి అన్నదాతలకు నష్టం

ఈపూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్లలో నకిలీ మొక్కజొన్న విత్తనాలు సాగుచేసి అన్నదాతలు నష్టపోయారు. గ్రామంలో సుమారు 60 ఎకరాలలో నంది 35రకం మొక్కజొన్న సాగుచేశారు. ఎకరాకు 20 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని చెప్పి విత్తనాలు ఇచ్చి పెట్టుబడి కింద ఎకరాకు రూ.20వేలు కంపెనీ వారు రైతులకు ఇచ్చారు. అంతేకాకుండా రూ.350కి తామే పండించిన పంటను కొనుగోలు చేస్తామన్నారు. రైతుల ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి పెట్టారు. కాని దిగుబడి ఐదు క్వింటాల నుంచి 10 క్వింటాలు రావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కంపెనీ ప్రతినిధులను నష్టం భరించాలని కోరారు. అందుకు వాళ్ళు ఒప్పుకోకపోవడంతో రైతులు పంట ఉత్పత్తులను తీసుకుపోకుండా అడ్డుకున్నారు.




ఆక్రమణ దారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఆక్రమణల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం: పీడీఎం

నరసరావుపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కత్వా చెరువు, వాగు ఆక్రమణలు తొలగింపులో మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పీడీఎం జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ, నల్లపాటి రామారావు శుక్రవారం ఆరోపించారు. ఆక్రమణ దారులు ఇది మా ఆస్తి అని బోర్డు పెట్టడం దౌర్జాన్యానికి పరాకాష్ట అన్నారు. కత్వా చెరువు, వాగు గత కొంతకాలం నుంచి ఆక్రమణకు లోనవుతున్నా, ఆక్రమణలు తొలగించి, వాగుని చెరువును కాపాడాల్సిన మునిసిపాలిటి అధికారులు తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తక్షణమే మునిసిపల్ అధికారులు వాగు విస్తీర్ణంను కొలిచి, ఆక్రమణలు తొలగించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


నాగన్నగా అలరించిన ఎమ్మెల్యే అరవిందబాబు



నరసరావుపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాల్లో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు బృందంలో నాగన్నగా నటించి మెప్పించారు. రాముడు, భీముడు మా నాయకుడు దేవుడు అంటు వేదికపైకి వచ్చి నవ్వులు పువ్వులు పూయించారు. సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్‌లతో సహచర ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును ప్రశంసించారు.

జీవీ సహకారంతో మునిసిపాలిటీకి నిధులు

● మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి



వినుకొండటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సహకారంతో మునిసిపాలిటీకి పెద్దఎత్తున నిధులు సమకూర్చడం జరిగిందని, ప్రతి వార్డుకు అవసరమైన నిధులు కేటాయించి పనులు పూర్తిచేస్తామని చైర్మన్ దస్తగిరి సభ్యులకు హామీ ఇచ్చారు. స్థానిక పురపాలక కార్యాలయంలో వినుకొండ మునిసిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశ అజెండాలోని 71 అంశాలకు గాను 66 అంశాలను కౌన్సిల్ సభ్యులు తీర్మానించారు. వార్డుల్లో పనులు జరగడం లేదంటూ కొందరు సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా గతంలో సూచించిన పనులకు నిధులు కేటాయించాలని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. గత అజెండాలో రద్దు చేసిన అంశాలను తిరిగి అజెండాలో చేర్చడంపై కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా తీర్మానం చేయాలంటూ కౌన్సిలర్ బాషా సభ దృష్టికి తీసుకురావడంతో చైర్మన్ మిగిలిన 66 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మరల్చాలి

● జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి

నరసరావుపేట రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీరో బడ్జెట్, నాచురల్ ఫార్మింగ్ వైపు పల్నాడు జిల్లాలో రైతులందరూ మొగ్గుచూపేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి ఆదేశించారు. శుక్రవారం నరసరావుపేట రావిపాడు రోడ్డు లోని బృందావనంలో జిల్లా స్థాయి సిబ్బంది సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిబ్బందితో గ్రామాల్లో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 28 మండలాల్లో గ్రామాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రతి ఒక్క రైతు చేత (పీఎండీఎస్) విధానాన్ని పాటించేలా చూడాలన్నారు. పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమల కుమారి మాట్లాడుతూ జిల్లాలోని 28 మండలాల్లో 132 గ్రామపంచాయతీలో, 2002 గ్రామ సమైక్య సంఘాలలో, 113 రైతు సేవ కేంద్రాల్లో ఇప్పటివరకు 35,540 మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి మార్చడం జరిగిందన్నారు. మొదట విడతగా 56 గ్రామాలు, రెండో విడతగా 64 గ్రామాలను, మొత్తం120 గ్రామాలను న్యాచురల్ ఫార్మింగ్ కింద తీసుకోవటం జరిగిందన్నారు. కార్యక్రమంలోస్టేట్ ఎస్ఎఫ్ఏలు లక్ష్మి, మన్విష, ఉషారాణి, జిల్లా ఎస్ఎఫ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జట్టుకు ముప్పాళ్ళ విద్యార్థులు ఎంపిక

ఈపూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు శుక్రవారం తెలిపారు. ఆర్‌వీఆర్ వీజేసీ ఇంజనీరింగ్ కళాశాల చోడవరంలో జరిగిన అంతర కళాశాలల పోటీలలో ఎస్‌కే హయామ్, ఆర్.బాలక్రిష్ణ, కే.నరేంద్ర, ఎం.ప్రేమకుమార్‌లు ప్రతిభ కనబరిచి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. మే నెలలో సింహపురి యూనివర్శిటీ నెల్లూరులో జరిగే అంతర విశ్వవిద్యాలయాల పోటీలలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీకి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాంనాయక్, సీహెచ్ అరవింద్, ఎం.దాసు, కే వంశీ చైతన్యలు అభినందించారు.